ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy  e - paper.vaarthasandhya.com  సంపుటి : 01 సంచిక : 194  గురువారం 02 - 07 - 2026  ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్  పేజీలు : 08  వెల : 6/-
Published From : Rangareddy  e - paper.vaarthasandhya.com  VOLUME : 01  Issue : 194  Thursday 02 - 07 - 2026  Editor : Seggem Kiran Kumar  Pages : 08  Price : 6/-

## 'వనజీవి రామయ్య'.. 90వ జయంతి సందర్భంగా
# ఘనంగా వనజీవి హరిత అవార్డులు




- వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ సేవకులకు సత్కారం..
- తెలంగాణ పల్లె ప్రకృతి వనాలకు వనజీవి రామయ్య పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- లఘుచిత్రంగా ప్రశంసలు పొందిన 'వనజీవి రామయ్య'ను పాన్ ఇండియా స్థాయి పూర్తి నిడివి చిత్రంగా నిర్మించనున్నట్లు నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి వెల్లడి

**హైదరాబాద్, జూన్ 30 (వార్త సంధ్య ) :** పర్యావరణ ఉద్యమకారుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత దివంగత దరిపల్లి రామయ్య (వనజీవి రామయ్య) సేవలను భావితరాలకు చాటిచెప్పే లక్ష్యంతో రూపొందిన 'వనజీవి రామయ్య' లఘుచిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో పూర్తి నిడివి ఫీచర్ ఫిల్మ్‌గా నిర్మించనున్నట్లు నిర్మాత నిడిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి ప్రకటించారు. వనజీవి రామయ్య 90వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వనజీవి హరిత అవార్డు పురస్కార మహోత్సవంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ కోసం విశేషంగా సేవలందిస్తున్న స్వచ్ఛంద సేవకులు, ప్రకృతి ప్రేమికులను ఘనంగా సన్మానించి వనజీవి హరిత అవార్డులను ప్రదానం చేశారు. మొక్కల వెంకటయ్యను ప్రత్యేకంగా సత్కరించగా, పర్యావరణ సేవలో విశేష కృషి చేస్తున్న పలువురికి అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి వాస్విక్ గ్రూప్ చైర్మన్, సినీ నిర్మాత నిడిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి, వాస్విక్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ నూకల భాస్కర్ రెడ్డి, దర్శకుడు వేముగంటి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి మాట్లాడుతూ, నీటి కరువు, పర్యావరణ సంక్షోభం వంటి సమస్యలను దశాబ్దాల క్రితమే ముందుగానే గుర్తించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడు వనజీవి రామయ్య అని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే యాత్రను - మిగతా 2 లో

# ఒడిశా పాఠ్యపుస్తకాల్లో బాలీవుడ్ పాట.. వెలుగులోకి వేలకొద్దీ తప్పులు!

- ఒడిశా 5వ తరగతి పాఠ్యపుస్తకంలో 'నిమ్బూడ నిమ్బూడ' పాట ముద్రణ
- విచారణకు ఆదేశించిన సీఎం.. బాధ్యులపై చర్యలు తీసుకున్నామన్న మంత్రి
- సరిదిద్దిన పుస్తకాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం వెల్లడి


2 లో

## వాట్సాప్ కొత్త ఫీచర్‌పై కేంద్రం ఆందోళన
# మోసాలకు ఆస్కారం!

- వాట్సాప్ కొత్త యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం పరిశీలన
- మోసాలు, ఫేక్ ప్రొఫైల్స్ పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన
- ఫోన్ నంబర్ లేకుండానే ఇతరులతో కనెక్ట్ అయ్యే సదుపాయమిది
- భద్రతా చర్యలు తీసుకున్నామంటున్న వాట్సాప్ యాజమాన్యం




**వార్త సంధ్య, ఢిల్లీ, జులై 01 :** మెటా యాజమాన్యంలోని వాట్సాప్ ఇటీవల ప్రవేశపెట్టిన 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై భారత ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ కొత్త ఫీచర్ ద్వారా ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ ప్రొఫైల్స్‌తో ఇతరులను మోసగించడం (ఇంపర్సొనేషన్) వంటివి పెరిగే అవకాశం ఉందంటూ ప్రభుత్వ అధికారులు - మిగతా 2 లో

# మూడెకరాల రైతులకు శుభవార్త


2 లో

- రైతు భరోసా నిధులు జమ
- 10.68 లక్షల మందికి లబ్ధి
- రూ.1,590.02 కోట్లు జమ
- డీబీటీ ద్వారా ఖాతాల్లోకి నిధులు
- ఇప్పటివరకు రూ.4,072.04 కోట్లు విడుదల
- 54.96 లక్షల మంది రైతులకు లబ్ధి

## ఏఐతో అనుసంధానం, ఆ శాఖల్లో
# లీకులు లేకుండా చూడండి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్ర ఆదాయ సమీకరణపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- ప్రభుత్వానికి ఆదాయం పెంపుపై అధికారులతో సమావేశం
- ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందేనన్న సీఎం రేవంత్



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 01 :** రాష్ట్ర ఆదాయ సమీకరణపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయం పెరగాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్‌శాఖ, మైనింగ్‌శాఖల్లో లీకులు లేకుండా చూడాలని సూచించారు. ఆదాయ సమీకరణ కోసం చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఐతో లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేలా బడ్జెట్‌ను తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుల భూసేకరణకు మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. బడ్జెట్ ఊహాజనితంగా కాకుండా వాస్తవికంగా రూపొందించుకోవాలన్నారు. వివిధశాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఆదాయం పెంపు, - మిగతా 2 లో



## రాముడి గుడిలోనే
# దొంగతనమా?

- మోదీ, అమిత్ షాలపై జగ్గారెడ్డి ఆగ్రహం
- అయోధ్య రామమందిరంలో హుండీ డబ్బుల చోరీపై జగ్గారెడ్డి ఆగ్రహం
- యూపీలో, కేంద్రంలో బీజేపీ ఉన్నా దొంగతనం జరిగిందని మండిపాటు
- ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 01 :** అయోధ్య శ్రీరామ మందిరంలో భక్తులు సమర్పించిన హుండీ డబ్బుల చోరీ ఘటనపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీలోనూ, కేంద్రంలోనూ బీజేపీ ప్రభుత్వమే ఉన్నా, - మిగతా 2 లో

## కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ
# ఈసీకి 700 ఫిర్యాదులు



- కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరుపై అభ్యంతరం
- కేంద్ర ఎన్నికల సంఘానికి దాదాపు 700 అభ్యంతరాలు
- ఫిర్యాదు చేసిన వారిలో అత్యధికం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలే
- అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్న ఈసీ

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 01 :** కల్వకుంట్ల కవిత స్థాపించిన నూతన రాజకీయ పార్టీ పేరుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఆమె ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) దాదాపు 600 నుంచి 700 వరకు అభ్యంతరాలు అందాయి. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి - మిగతా 2 లో



## 'మావిగన్ వర్సెస్ అమరావతి'
# చూసుకుందాం

- వైసీపీ అధినేత జగన్
- తాము మావిగన్ కు కట్టుబడి ఉన్నామన్న జగన్
- మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని వ్యాఖ్య
- ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టీకరణ

**వార్త సంధ్య, అమరావతి, జులై 01 :** ఏపీ రాజధాని అమరావతిని వైసీపీ అధినేత జగన్ మరోసారి తిరస్కరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మావిగన్ కే కట్టుబడి ఉన్నామని... వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి అని - మిగతా 2 లో

# శెహభాష్.. లోకేశ్



- విద్యా శాఖ మంత్రిగా లోకేశ్ పనితీరుకు రాష్ట్రపతి ప్రశంసలు
- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు
- రాష్ట్రంలో విద్యా సంస్కరణలు కొనసాగించాలని సూచన
- అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవం అనంతరం ఘటన
- లోకేశ్ ప్రసంగం యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉందని అభినందన

**వార్త సంధ్య, అమరావతి, జులై 01 :** ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని, వాటిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న - మిగతా 2 లో

## పెట్టుబడుల్లో దేశంలోనే
# ఏపీ నెంబర్ 1

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- గూడూరులో మెగా ఫర్నిచర్ పార్క్
- గూడురు ఫర్నిచర్ పార్క్ ద్వారా 10 వేల మందికి ఉపాధి లభిస్తుందన్న సీఎం
- 'పీ4' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రబాబు పిలుపు
- ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే తమ సంకల్పమని వెల్లడి
- ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని మరోసారి హెచ్చరించిన సీఎం



**వార్త సంధ్య, అమరావతి, జులై 01 :** పేదలకు అండగా ఉంటూ సంక్షేమం అందిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పేదరిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలునిచ్చారు. నెల్లూరు జిల్లా పున్నపువారిపాలెం ప్రజావేదిక సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. పేదవారందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తాం. డ్వాక్రా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలి. అందరికీ సంక్షేమ - మిగతా 2 లో

# సంపాదకీయం

## డేటా సెంటర్లపై బేజారు

చార్లీ చాప్లిన్ అద్భుత దృశ్యకావ్యాల్లో ఒకటైన 'గోల్డ్ రష్' నిరుడు శతవసంతాలు పూర్తిచేసుకుంది. 1890ల్లో కెనడాలోని క్లోన్‌డైక్ ప్రాంతంలో బంగారం గనులున్నాయని వెల్లడై ప్రపంచం నలుమూలలనుంచీ వేలాదిమంది జనం అక్కడికి పరుగులు తీయడం, పోటీపడటం కథాంశం. ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ కృత్రిమ మేధ(ఏఐ)కి సంబంధించిన డేటా సెంటర్లలో పెట్టుబడుల్ని ఆకర్షించటానికి అలాగే పరుగులు తీస్తున్నాయి. నిరుడు అక్టోబర్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం విడుదల చేసిన విశ్లేషణ డేటా సెంటర్ల సామర్థ్యం మరో నాలుగేళ్లలోనే మూడు రెట్లు పెరుగుతుందని అంచనా వేసింది. అదే సమయంలో తీవ్ర ఉష్ణోగ్రతలు, కరువుకాటకలు, ఇతర వాతావరణ దుష్ఫలితాల కారణంగా డేటా సెంటర్ల వార్షిక ఖర్చులు 2035కు 8,100 కోట్ల డాలర్లనుంచి 2065 నాటికి 16,800 కోట్ల డాలర్లకు పెరుగుతాయని అంచనా వేసింది. ఇప్పటికే క్లౌడ్ కంప్యూటింగ్ నిర్వహించటానికి... ఓటీటీలు, యూట్యూబ్‌వంటి వాటికోసం లైబ్రరీల నిర్వహణకూ, ఇతరేతర వినియోగానికీ డేటా సెంటర్లున్నాయి. ఏఐ రాకతో ఇవి మరింతగా పెరుగుతున్నాయి.డేటా సెంటర్ల విస్తరణతోపాటే వాటికి సంబంధించిన అవగాహన మొదలైంది. వాటివల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఇప్పుడిప్పుడే అందరికీ తెలుస్తోంది. ఆన్‌లైన్ సెర్చ్‌లతో పోలిస్తే ఏఐ ఆధారిత సెర్చ్‌లు పది రెట్లు అధిక విద్యుత్‌ను తీసుకుంటున్నా యని గణాంకాలు తేల్చాయి. ఈమధ్య విడుదలైన ఐక్యరాజ్యసమితికి చెందిన యూనివర్సిటీ అధ్యయన నివేదిక డేటా సెంటర్లను చల్లబరచడానికి బిలియన్లకొద్దీ లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు ఆవిరైపోతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ డేటా సెంటర్ల వల్ల తాగునీటి హక్కులకూ, వ్యవసాయానికీ తీవ్ర విఘాతం కలుగుతోందని హెచ్చరించింది. వీటిని అనుమతించే ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో పునరుత్పాదక ఇంధన వనరు లున్న ప్రాంతాలనే ఎంచుకునేలా చూడాలని సూచించింది. వినియోగిస్తున్న నీరు ఆవిరయ్యే ప్రస్తుత విధానానికి బదులు నీటి అవసరం లేని ఎయిర్ కూలింగ్, లిక్విడ్ ఇమ్మర్షన్ కూలింగ్‌వైపు మారేలా డేటా సెంటర్లపై ఒత్తిడి తేవాలని ప్రభుత్వాలకు సలహా ఇచ్చింది. డేటా సెంటర్లు తాము వినియోగించే నీరు, విద్యుత్ ఎంతో... విడుదలయ్యే కర్బన ఉద్గారాల పరిమాణం ఎంతో తెలిపే డేటాను అందరికీ అందుబాటులో ఉంచేలా నిబంధనలు రూపొందించాలని తెలిపింది.డేటా సెంటర్లపై అక్కడక్కడా ఆందోళనలు పెరుగుతున్నాయి. ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో ఈ సెంటర్లు పెరగటాన్ని నిరసిస్తూ ఉద్యమాలు జరగటంతో కొత్తవాటిపై కఠిన మైన ఆంక్షలు విధించారు. నెదర్లాండ్స్‌లో కూడా రైతులు, పర్యావరణవేత్తలు ఆందోళ నలు చేశారు. దాంతో హైపర్‌స్కిల్ డేటాసెంటర్ల నిర్మాణాలను ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధించింది. సింగపూర్‌లో పర్యావరణహిత సెంటర్లకు పరిమితమైన అనుమతు లిస్తున్నారు. చిలీలో డేటా సెంటర్ ఏర్పాటుపై జనం తిరగబడటంతో గూగుల్ సంస్థ గాలితో చల్లబరిచే సాంకేతికత దిశగా ప్రాజెక్టును డిజైన్ చేసుకుంది.ఏడాదిలో 365 రోజులూ వేలాది సర్వర్ రాక్‌లూ, డిజిటల్ డేటాను భద్రపరిచే హార్డ్ డ్రైవ్‌లూ, నెట్‌వర్కింగ్ పరికరాలూ, లక్షలసంఖ్యలో యూపీఎస్‌లు పనిచేస్తుండటంవల్ల వాటిని చల్లబరచటానికి నిరంతరాయంగా నీరు అవసరమవుతుంది. భారీగా విద్యుత్ కావలసివస్తుంది. ఇక ఆ సెంటర్లలోవాడే భారీ కూలింగ్ ఫ్యాన్లు , ఇండస్ట్రియల్ ఏసీల వల్ల ఒకరకమైన ధ్వని తప్పదు. పగలు ఇతర చప్పుళ్లతో ఇది కలిసిపోయినా, రాత్రివేళల్లో మూడు నాలుగు కిలోమీటర్ల మేర ఈ ధ్వని వినబడుతుంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో, అమెరికాలోని వర్జీనియాలో కేవలం ఈ కారణం వల్లే స్థానికులు కోర్టులకెక్కారు.ప్రజల ఒత్తిళ్లతో ఈమధ్య కాలిఫోర్నియాలోని ఒక మున్సిపాలిటీ కొత్త డేటా సెంటర్లపై నిషేధం విధించింది. వీటన్నిటి నేపథ్యంలో నీటి అవసరం పెద్దగా లేని సాంకేతికతలు వస్తున్నాయి. ఏఐ ఆధారిత సాంకేతికత ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అదనంగా వినియోగించకుండా కట్టడి చేస్తున్నారు. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరిస్తే, ఆ సెంటర్లు వినియోగించే పర్యావరణహిత సాంకేతికతల సమాచారాన్నీ, వాటి ఉద్గారాల పరిమాణాన్నీ ప్రజలకూ, పర్యావరణవేత్తలకూ అందుబాటులో ఉంచితే ప్రజల్లో ఉండే ఆందోళన తగ్గుతుంది.

# పెట్టుబడుల్లో దేశంలోనే ఏపీ నెంబర్ 1

మొదటిపేజీ తరువాయి - ఫలాలు అందాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలి. పారిశ్రామిక అభివృద్ధిలో ఏపీ చాలా ముందుంది. దేశంలోనే మెగా ఫర్నిచర్ పార్క్ గూడూరులో వస్తోంది. 10 వేల మందికి ఉపాధి కల్పించబోతున్నాం. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. ఒకప్పుడు పెట్టుబడి దారులు పారిపోయారు. ఇప్పుడు రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వస్తున్నారు. నమ్మకం కలిగించినందుకే రాష్ట్రానికి క్యూ కడుతున్నారు" అని చంద్రబాబు అన్నారు.తన రాజకీయ జీవితంలో ఎన్నో పార్టీలను చూశానని, నేరాలు చేసే పార్టీని, నేరస్థులను కాపాడే పార్టీని చరిత్రలో మొదటిసారి ఇప్పుడే చూస్తున్నానని మండిపడ్డారు. అర్హత లేనివాళ్లకు అందలం ఎక్కిస్తే చాలా సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అవుతుందని మరోసారి హెచ్చరించారు. హోంమంత్రి అనితపై అసభ్య వ్యాఖ్యలను తప్పుబట్టారు. గొడ్డలి పార్టీ నేత సతీమణిపై పోస్టు పెడితే వెంటనే అరెస్టు చేశామని, ఆడవాళ్లపై నోరు పారేసుకున్న ఎవరినీ వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు. విజయవాడలో ఒక వ్యక్తి అదృశ్యమయ్యారని, ఆయనను అరెస్టు చేసిన తర్వాతే మిస్ అయ్యాడని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రాగానే సిట్ వేసి దర్యాప్తు ప్రారంభించామని, తప్పు చేసింది పోలీసులైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించానని చెప్పారు. అయితే, ఈ వ్యవహారానికి కొందరు కుల ముద్ర వేసి విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టారని, అసలు ఇలాంటి అసభ్యకర పోస్టులతో ఏం సాధించాలని అనుకుంటున్నారని చంద్రబాబు ప్రశ్నించారు. గతంలో తన భార్యను అసెంబ్లీ సాక్షిగా దూషిస్తే, తాము ఎంతో మానసిక క్షోభ అనుభవించామని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఏకంగా డిప్యూటీ సీఎం కుమార్తెలపై కూడా నీచమైన పోస్టులు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గొడ్డలి పార్టీ కులమతాల మధ్య చిచ్చుపెడుతూ అమరావతిపై దుష్ప్రచారం చేస్తోందని, గత ఐదేళ్లలో మూడు ముక్కలాట తప్ప ఏమీ చేయలేదని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. భవిష్యత్తులో అన్ని ఏసీ బస్సులే నడుపుతామన్నారు. లబ్ధిదారులు ఏదైనా ఒక నెలలో తీసుకోకపోయినా, మూడు నెలల పింఛన్ ఒకేసారి ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి తాను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి ముందుకొచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్ర మాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నా మని, సుపరిపాలనకు నాంది పలికామని హర్షం వ్యక్తం చేశారు. 'మన మిత్ర' యాప్‌లోనే అన్ని ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచామని, 62.20 లక్షల మంది కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. తాను ఇంట్లో కూర్చుని బటన్ నొక్కేవాణ్ని కాదని, ప్రజల్లో ఉండే వ్యక్తినన్నారు. 28 కేటగిరీల వారికి పండుగ వాతావరణంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి 'సంజీవని ప్రాజెక్టు' తీసుకువస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గంజాయికి ఆంధ్రప్రదేశ్‌లో అస్సలు చోటు లేదని, రాష్ట్రాన్ని పూర్తిగా డ్రగ్ రహితంగా తయారుచేస్తామని స్పష్టం చేశారు. విద్యా రంగంలో మార్పులు వస్తున్నాయని, ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ బడుల్లోకి విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

## రామయ్య'.. 90వ జయంతి సందర్భంగా ఘనంగా వనజీవి హరిత అవార్డులు

మొదటిపేజీ తరువాయి - చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని పల్లె ప్రకృతి వనాలకు వనజీవి రామయ్య పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ, దాదాపు ఏడు దశాబ్దాల పాటు తన జీవితాన్నే మొక్కల కోసం అంకితం చేసిన వనజీవి రామయ్య సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని, అదే లక్ష్యంతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ సినిమా ద్వారా పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.హీరోయిన్ నాగరాణి మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే ఇలాంటి సందేశాత్మక చిత్రంలో నటించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ మాట్లాడుతూ, వనజీవి రామయ్య జీవిత కథకు సంగీతం అందించడం తన కెరీర్‌లో గర్వించదగ్గ అవకాశమని పేర్కొన్నారు.ఇప్పటికే ఈ 'వనజీవి రామయ్య' లఘుచిత్రం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే గద్దర్ అవార్డ్స్లో ఉత్తమ లఘుచిత్రాల విభాగానికి ఎంపిక కావడం విశేషం. ఈ చిత్రంలో బ్రహ్మాజీ టైటిల్ పాత్రలో నటించగా, కథను డా. కళా రంగా అందించారు. సంగీతాన్ని బల్లేపల్లి మోహన్ సమకూర్చగా, సినిమాటోగ్రఫీని తోట కె. రమణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొక్కల సత్యనారాయణ, మొక్కల వెంకటయ్యతో పాటు వాస్విక్ ఫౌండేషన్ సభ్యులు, మాజీ సైనికులు, సాహిత్య, సామాజిక రంగ ప్రముఖులు, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వనజీవి రామయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి



వాటిని సంరక్షించాలని వారు పిలుపునిచ్చారు. నిర్మాత: నిడిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి,దర్శకుడు వేముగంటి, సంగీతం బల్లేపల్లి మోహన్, డీఓపీ తోట కె. రమణ,సాహిత్యం ఘనయాది.నటీనటులు, నాగరాణి, నాగమళ్ళ మహేష్, సురేష్ బాబు, కేవీమ్ వెంకట్, బల్లేపల్లి మోహన్ తదితరుల, పీఆర్ఓ అశోక్ దయ్యాల పాల్గొన్నారు.

## ఒడిశా పాఠ్యపుస్తకాల్లో బాలీవుడ్ పాట.. వెలుగులోకి వేలకొద్దీ తప్పులు!

మొదటిపేజీ తరువాయి -

ఒడిశాలో విద్యావ్యవస్థలో జరిగిన ఓ భారీ తప్పిదం తీవ్ర దుమారం రేపుతోంది. ఐదో తరగతి విద్యార్థుల కోసం ముద్రించిన ప్రభుత్వ పాఠ్యపుస్తకంలో ఏకంగా ఓ ప్రముఖ బాలీవుడ్ సినిమా పాటను అచ్చు వేయడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో విద్యాశాఖపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు ఈ పొరపాటును ట్రోల్ చేయగా, మరికొందరు ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒడిశా ప్రభుత్వ పాఠశాలల్లో వినియోగిస్తున్న 5వ తరగతి పాఠ్యపుస్తకంలోని ఓ పాఠంలో ఈ పొరపాటు చోటుచేసుకుంది. 1999లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిందీ చిత్రం 'హమ్ దిల్ దే చుకే సనమ్'లోని సూపర్ హిట్ పాట 'నిమ్మోడ నిమ్మోడ'ను యథాతథంగా ముద్రించారు. ఐశ్వర్య రాయ్‌పై చిత్రీకరించిన ఈ పాట, వాస్తవానికి ఓ రాజస్థానీ జానపద గీతం. పుస్తకాల ప్రింటింగ్ లేదా ప్రచురణ దశలో జరిగిన తీవ్రమైన నిర్లక్ష్యం కారణంగానే ఈ భారీ తప్పిదం జరిగిందని భావిస్తున్నారు. ఈ ఘటన రాష్ట్ర విద్యావ్యవస్థ, పాఠ్యపుస్తకాల సమీక్షా కమిటీల పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది.అయితే, ఈ సినిమా పాట ముద్రణ ఒక్కటే పొరపాటు కాదని, రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) పుస్తకాల్లో ఇలాంటివి వేల సంఖ్యలో ఉన్నాయని తేలడం గమనార్హం. మొత్తం పాఠ్యపుస్తకాల్లో 1,600కు పైగా తప్పులు ఉన్నట్టు గుర్తించారు. వీటిలో 8వ తరగతి పుస్తకాల్లోనే అత్యధికంగా 705 తప్పులు ఉన్నాయి. ఈ తప్పుల్లో కొన్ని విస్తుపో యేలా ఉన్నాయి. ఉదాహరణకు, కర్ణాటక అసెంబ్లీ భవనాన్ని ఒడిశా విధాన సభగా, గొప్ప శాస్త్రవేత్త సర్ ఐజాక్ న్యూటన్‌ను 'గొప్ప పైలట్'గా, కర్ణాటకలోని హంపిని కోణార్క్ సూర్య దేవాలయంగా పేర్కొన్నారు. వీటితో పాటు వ్యాకరణ దోషాలు, స్పెల్లింగ్ తప్పులు, తప్పుడు సమాచారం వంటివి కోకొల్లలుగా ఉన్నాయి.ఈ వ్యవహారంపై ఒడిశా పాఠశాల, సామూహిక విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్ స్పందించారు. పాఠ్యపుస్తకాల్లోని తప్పులను ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేశారని, నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని ఆయన వెల్లడించారు."సరిదిద్దిన పాఠ్యపుస్తకాల కాపీలను వెంటనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనివల్ల విద్యార్థుల చదువుపై ఎలాంటి ప్రభావం పడకుండా, వారికి సరైన సమాచారం అందుతుంది" అని మంత్రి వివరించారు. కొత్త పుస్తకాలు చేరే వరకు, ప్రస్తుతం ఉన్న పుస్తకాల్లోని తప్పులను ఉపాధ్యాయులే సరిదిద్ది విద్యార్థులకు బోధించాలని సూచించినట్టు ఆయన తెలిపారు. మొత్తం మీద ఈ ఘటన ఒడిశాలో పాఠ్యపుస్తకాల నాణ్యతా తనిఖీల ప్రక్రియపై తీవ్ర చర్చకు దారితీసింది.

## శెహభాష్.. లోకేశ్

మొదటిపేజీ తరువాయి - అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కార్యక్రమం ముగిశాక, రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు మంత్రి లోకేశ్ హెలికాప్టర్ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను తన వద్దకు పిలిచిన రాష్ట్రపతి, విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి కేంద్రంగా సాగుతున్న ఈ సంస్కరణలు వారికి బంగారు భవిష్యత్తును అందిస్తాయని అన్నారు.అంతకుముందు స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ చేసిన ప్రసంగం యువతలో స్ఫూర్తి నింపేలా సాగిందని రాష్ట్రపతి కొనియాడారు. పట్టభద్రులకు మంచి సందేశం ఇచ్చారని అభినందించారు. ఏపీ విద్యా విధానాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు లోకేశ్ కృషి చేస్తున్న విషయం తెలిసిందే.

## 'మావిగన్ వర్సెస్ అమరావతి'.. చూసుకుందాం

మొదటిపేజీ తరువాయి - ఆయన అన్నారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'జగన్ అమరావతికి వ్యతిరేకం' అంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని చెప్పారు. అమరావతి పేరుతో చంద్రబాబు సాగిస్తున్న స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని, అందుకే ఈ మావిగన్ ప్రతిపాదనను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ సరికొత్త ప్రతిపాదనకు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకే ఓటు వేస్తారని, వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టం చేశారు.

## వాట్సాప్ కొత్త ఫీచర్‌పై కేంద్రం ఆందోళన.. మోసాలకు ఆస్కారం!

మొదటిపేజీ తరువాయి - తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టినట్లు బుధవారం వెలువడిన పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.వాట్సాప్ ఈ యూజర్‌నేమ్ ఫీచర్‌ను జూన్ 29న ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసింది. దీనివల్ల వినియోగదారులు తమ ఫోన్ నంబర్లను బహిర్గతం చేయకుండానే, కేవలం యూజర్‌నేమ్ ద్వారా ఇతరులతో సంభాషించే అవకాశం ఉంటుంది. ఇది వినియోగదారుల గోప్యతను మరింత మెరుగుపరుస్తుందని, ముఖ్యంగా స్పామ్ కాల్స్, సిమ్-స్వాపింగ్ వంటి ముప్పుల నుంచి రక్షణ కల్పిస్తుందని వాట్సాప్ పేర్కొంది. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించకుండా ఉండేందుకు కొన్ని పేర్లను ముందస్తుగా రిజర్వ్ చేసినట్లు కూడా సంస్థ వెల్లడించింది.అయితే, ఈ ఫీచర్‌పై ప్రభుత్వ వర్గాలు పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. 50 కోట్లకు పైగా వినియోగదారులతో వాట్సాప్‌కు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న నేపథ్యంలో, ఈ మార్పులపై ఆందోళన నెలకొంది. మోసగాళ్లు బ్యాంకులు, పాపులర్ బ్రాండ్లు లేదా ప్రముఖుల పేర్లను పోలిన యూజర్‌నేమ్‌లను సృష్టించి సామాన్యులను మోసగించే ప్రమాదం ఉందని అధికారులు విశ్లేషిస్తున్నారు. "ఈ అంశంలో భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సింది వాట్సాప్ యాజమాన్యమే" అని ఓ అధికారి స్పష్టం చేశారు.గతంలో పరీక్షల పేపర్ల లీకేజీ ఉదంతాల్లో టెలిగ్రామ్‌పై కేంద్రం కఠిన చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. అదే తరహాలో, యూజర్‌నేమ్ ఫీచర్ దుర్వినియోగాన్ని అరికట్టడంలో విఫలమైతే వాట్సాప్ మాతృసంస్థ మెటాకు నోటీసులు జారీ చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఈ ఫీచర్‌కు సంబంధించిన భద్రతా ప్రమాణాలను నిశితంగా సమీక్షిస్తోంది. వినియోగదారుల గోప్యత మరియు సైబర్ భద్రత మధ్య సమతుల్యత సాధించే వరకూ ఈ విషయంలో ఉత్కంఠ కొనసాగే అవకాశం ఉంది.


## మూడెకరాల రైతులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి - తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీ రెండో రోజూ కొనసాగింది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులందరి బ్యాంకు ఖాతాల్లోకి బుధవారం నిధులను డీబీటీ విధానంలో నేరుగా జమ చేసింది.ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 10.68 లక్షల మంది రైతులకు రూ.1,590.02 కోట్ల పెట్టుబడి సాయం అందనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు రైతు భరోసా కింద 54.96 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి మొత్తం రూ.4,072.04 కోట్ల నిధులను విజయవంతంగా బదిలీ చేసినట్లు తెలిపింది. వానాకాలం సాగు ప్రారంభమైన వేళ ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఈ సాయం ఉపయోగపడుతుండటంతో రైతులు సాగు పనులను వేగవంతం చేస్తున్నారు.

## ఏఐతో అనుసంధానం, ఆ శాఖల్లో లీకులు లేకుండా చూడండి

మొదటిపేజీ తరువాయి - నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందేనని ఆదేశించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.

## కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ.. ఈసీకి 700 ఫిర్యాదులు



మొదటిపేజీ తరువాయి - చర్చనీయాంశంగా మారింది.ఈ అభ్యంతరాలను ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు వ్యక్తం చేశారు. గతంలో 'తెలంగాణ రాష్ట్ర సమితి'గా ఉన్న తమ పార్టీ పేరును ఇది పోలి ఉండటం వల్ల ప్రజల్లో గందరగోళం తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు అభ్యంతరాలపై కవిత పార్టీ ప్రతినిధులు ఈసీకి వివరణ ఇచ్చారని, మిగిలిన వాటికి కూడా సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.తెలంగాణ ఉద్యమంలో 'టీఆర్ఎస్' కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 2026 ఏప్రిల్ నెలాఖరులో కవిత తన నూతన పార్టీని ప్రకటించిన సమయంలో, ఈ పేరుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. అనంతరం, ఈసీఐ అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు ఇచ్చింది. జూన్ నెలలో బీఆర్ఎస్ పార్టీ అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు, సోలాపూర్‌కు చెందిన మరో సంస్థ కూడా ఇదే తరహా పేరు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఈ ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది.ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం అందిన అన్ని అభ్యంతరాలను, వాటికి లభించిన వివరణలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రాజకీయ పార్టీల పేర్లు, గుర్తుల నిబంధనలకు అనుగుణంగా, ఓటర్లలో ఎలాంటి అయోమయం లేకుండా చూసేందుకు సమీక్ష నిర్వహించిన తర్వాతే ఈసీ తన తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

## రాముడి గుడిలోనే దొంగతనమా?



మొదటిపేజీ తరువాయి - రామాలయ ట్రస్ట్ వారి పరిధిలోనే నడుస్తున్నా... ఈ దొంగతనం జరిగిందని ఆయన అన్నారు. ఈ చోరీపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇన్నేళ్లుగా రాముడి పేరును కేవలం రాజకీయాల కోసం, ఓటు బ్యాంక్ కోసమే బీజేపీ వాడుకుందని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై విచారణకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపీల బృందాన్ని పంపనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అన్ని మతాలను గౌరవిస్తుందని, ఈ వైఫల్యానికి గాను ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలపై జగ్గారెడ్డి స్పందిస్తూ... కేటీఆర్ ప్రస్తుతం ఖాళీగా ఉండి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేస్తూ పాలనలో బిజీగా ఉన్నారని చెప్పారు. కేటీఆర్ ఎన్ని విమర్శలు చేసినా రేవంత్ రెడ్డే సీఎంగా కొనసాగుతారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## జింఖానా క్లబ్‌కు కేంద్రం షాక్: ఖాళీ చేయాలంటూ షోకాజ్ నోటీసు


**ఢిల్లీ జింఖానా క్లబ్‌ను ఖాళీ చేయించేందుకు కేంద్రం చర్యలు వేగవంతం**

**పబ్లిక్ ప్రిమిసెస్ చట్టం కింద క్లబ్‌కు షోకాజ్ నోటీసు జారీ**

**జూలై 7న విచారణకు హాజరుకావాలని ఎస్టేట్ అధికారి ఆదేశం**

**రక్షణ, ప్రజా భద్రత అవసరాల కోసం భూములు అవసరమంటున్న ప్రభుత్వం**

**లీజు రద్దు తర్వాత క్లబ్ ఆక్రమణ చట్టవిరుద్ధమని కేంద్రం వాదన**



దేశ రాజధానిలోని అత్యంత కీలకమైన ల్యూటెన్స్ జోన్‌లో ఉన్న ఢిల్లీ జింఖానా క్లబ్‌ను ఖాళీ చేయించే దిశగా కేంద్ర ప్రభుత్వం తన చర్యలను వేగవంతం చేసింది. సఫ్దర్‌జంగ్ రోడ్డులోని 27.3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకునేందుకు 'పబ్లిక్ ప్రెమిసెస్ (ఎవిక్షన్) యాక్ట్, 1971' కింద క్లబ్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.ఈ వ్యవహారంలో ఎస్టేట్ అధికారి తాజాగా స్పందిస్తూ, క్లబ్‌ను ఎందుకు ఖాళీ చేయించకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇందు కోసం జూలై 7వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. క్లబ్ ప్రతినిధులు తమ వాదనలకు మద్దతుగా తగిన ఆధారాలను సమర్పించాలని, లేనిపక్షంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.లీజు ఒప్పందాన్ని రద్దు చేసిన తర్వాత కూడా క్లబ్ ఈ ప్రాంగణంలో కొనసాగడం పూర్తిగా చట్టవిరుద్ధమని, అనధికారికమని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. ప్రధానమంత్రి నివాసంతో సహా అనేక వ్యూహాత్మక ప్రాంతాలకు సమీపంలో ఉన్న ఈ భూమిని రక్షణ రంగ మౌలిక సదుపాయాలు, ప్రజా భద్రత, పరిపాలనా అవసరాలు మరియు ఇతర ప్రజా ప్రయోజన ప్రాజెక్టుల కోసం వినియోగించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.1928 నాటి లీజు ఒప్పందం ప్రకారం ఈ క్లబ్ ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తోంది. అయితే, ఒప్పందంలోని క్లాజ్ 4 ప్రకారం, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే పూర్తి హక్కు ప్రభుత్వానికి ఉంటుంది. ఈ నిబంధనను పురస్కరించుకునే కేంద్రం ప్రస్తుతం కఠిన చర్యలు చేపట్టింది. కాగా, క్లబ్ నిర్వహణలో అవకతవకలు జరిగాయని, సుమారు రూ. 47 నుంచి 48 కోట్ల వరకు అద్దె బకాయిలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గత మే నెలలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను క్లబ్ యాజమాన్యం ఢిల్లీ హైకోర్టులో సవాలు చేయగా, ప్రస్తుతం ఆ కేసు విచారణలో ఉంది.

వార్త సంధ్య
vaartha sandhya
తెలుగు దిన పత్రిక
RNI TGTEL/25/A5065



# టీఆర్ఎస్(డీ) పార్టీలో సభ్యత్వాల పేరుతో వసూళ్లు..

మెంబర్‌షిప్, పదవుల పేరుతో డబ్బులు తీసుకున్నారని ఆరోపణ..

మాకు న్యాయం చేయాలి.. టీఆర్ఎస్(డీ) పార్టీ బాధితుల డిమాండ్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 01 (వార్త సంధ్య) :** టీఆర్ఎస్(డీ) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ పై సభ్యత్వాలు, పార్టీ పదవుల పేరుతో డబ్బులు వసూలు చేశారంటూ కొందరు బాధితులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు టీఆర్ఎస్(డీ) పార్టీలో మోసపోయిన బాధితుల తరపున తోడేటి శంకర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకటన ప్రకారం, పార్టీ రిజిస్ట్రేషన్‌లో తప్పు చిరునామా ఇచ్చారని, అమాయకులను పార్టీ రిజిస్ట్రేషన్ బాడీలో చేర్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే సభ్యత్వం, పార్టీ పదవులు ఇప్పిస్తామని చెప్పి ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 56 మంది వద్ద నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.5,000 చొప్పున, మొత్తం సుమారు రూ.2.80 లక్షలు వసూలు చేశారని పేర్కొన్నారు. తమ వద్ద చెల్లింపులకు సంబంధించిన రసీదులు, ఆధారాలు ఉన్నాయని తెలిపారు. బాధితుల్లో తోడేటి శంకర్ గౌడ్, చిగుళ్ల రాజు, డాక్టర్ వాసంపల్లి ఆనంద్, ఈదునూరి నర్సింగు, తోడేటి స్వరూప, నేరెళ్ల జైపాల్ గౌడ్ తదితరులు ఉన్నారని వెల్లడించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన మహిళల వద్ద నుంచి కూడా సభ్యత్వాల పేరుతో డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. పార్టీలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ, ప్రశ్నించిన వారిని పదవుల నుంచి తొలగించడం, సస్పెండ్ చేయడం జరుగుతోందని ఆరోపించారు. తాము ప్రశ్నించినందుకే వాట్సాప్ ద్వారా సస్పెన్షన్ లేఖ పం పించారని తోడేటి శంకర్ గౌడ్ తెలిపారు. అన్ని జిల్లాలకు చెందిన బాధి తులు త్వరలో ఒక తేదీ నిర్ణయించి కొత్తగూడెంలోని నరాల సత్యనారాయణ నివాసం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తమ నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు, మీడియా తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తాను 24 ఏళ్లుగా తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన కార్యకర్తనని పేర్కొన్న తోడేటి శంకర్ గౌడ్, బాధితు లందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# ఆక్రమణదారు నుంచి నా భూమిని రక్షించాలి

- మంత్రి శ్రీధర్ బాబు ఈ విషయంలో చొరవ తీసుకోవాలి
- అధికారులకు మొరపెట్టుకుంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు బడితెల రామయ్య




**మంథని, జులై 01(వార్త సంధ్య) :** తన ఇంటిని అనుకుని ఉన్న తన సొంత స్థలాన్ని మారుపాక రమేష్, అనే వ్యక్తి దురాక్రమణ చేసి తనను చంపుతానని బెదిరిస్తున్నాడని బడితెల రామయ్య (83) సంవత్సరాల రిటైర్డ్ ఉపాధ్యాయుడు వృద్ధుడు మొరపెట్టుకున్నాడు. బుధవారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను మంథని మునిసిపల్ పరిధిలోని పోచమ్మ వాడలో నివసిస్తున్నానని, తన ఇంటికి దక్షిణం వైపు నివాసం ఉంటున్న వ్యక్తి తన భూమిని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణం చేసి గోడలు, గేటు ఏర్పాటు చేశాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన స్థలాన్ని దురాక్రమణ చేసి అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆయనని నిస్సాహాయతను వ్యక్తం చేశారు. తాను ఎవరితోనూ ఎన్నడు వివాదములు కలిగిలేనని అలాంటి తనపై వారు దురుసుగా ప్రవర్తించడం తనను మానసిక ఒత్తిడికి గురిచేస్తుందని ఆయన తెలిపారు. ఆక్రమణదారుని చర్యల వలన తన స్థిర నివాసానికి గోడ పగుళ్లు వచ్చి నీరు లోపలికి ప్రవహిస్తుండడం ఇబ్బందిగా మారిందన్నారు. తనను మారినాయుధాలతో బెదిరించిన విషయమై ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ విషయంలో గతంలో మానవ హక్కుల సంఘమును సంప్రదించగా వారు జిల్లా ఎస్పీ మంథని సీఐని అక్కడికి వెళ్లి సమస్య పరిష్కరించమని చెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. తన స్థలంలో పైప్ లైన్ తీసాడని అలాగే అక్రమంగా గోడ నిర్మించి గేటు పెట్టాడని మున్సిపల్ అధికారులు నిర్ధారించినప్పటికీ సమస్య పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తన స్థలాన్ని ఆక్రమణదారుని చెర నుంచి విడిపించి తనకు అప్పగించాలని సంబంధిత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తాను ఎదుర్కొంటున్న మానసిక ఆవేదనకు పరిష్కారం చూపాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్. మంథని ఆర్డీఓ, ఎమ్మార్వో, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, ఈ శాఖలకు సంబంధించిన ఉన్న తాధికారులు. చొరవ తీసుకొని నా భూమిని నాకు ఇప్పించగలరని బాధితుడు బడితెలా రామయ్య, కోరారు.

# ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళాశాలలకు అవసరమైన వసతులపై ప్రతిపాదనలు అందించాలి

ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి ప్రతి ఓటరు నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించాలి

కమాన్ పూర్ లో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలి

మంథనిలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల తనిఖీ, ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన, కమాన్పూర్ నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మంథని, జూలై 01( వార్త సంధ్య) :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మంథనిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ చేసి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, బోధనా పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మంథని పట్టణంలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆ తర్వాత కమాన్ పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కళాశాల యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాలల్లో అదనపు మౌలిక వసతులు అవసరమైతే సంబంధిత ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్వో) తమ పరిధిలోని ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని సక్రమంగా నింపడంలో అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరు నుంచి తప్పనిసరిగా నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి, నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కమాన్ పూర్ మండల ంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, మిగిలిన రీనోవేషన్, తుదిదశ పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలో కార్యాలయాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, మంథని తహసీల్దార్ అరిఫోద్దిన్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, కమాన్ పూర్ తహసీల్దార్ వాసంతి, ఏఈ పి.ఆర్.జగదీష్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి హెడ్ ఆఫీస్ ముట్టడితో మార్మోగిన కొత్తగూడెం

12వ వేజ్ బోర్డు ఏర్పాటు - నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని జేఏసీ డిమాండ్




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 01 (వార్త సంధ్య) :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ (ఏఐటియుసి, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్) ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద నిర్వహించిన మహా ధర్నా, ముట్టడి కార్యక్రమం భారీ విజయాన్ని సాధించింది. సింగరేణి అన్ని ఏరియాల నుంచి వేలాదిమంది కార్మికులు, నాయకులు తరలివచ్చి "డిమాండ్ల డే" కార్యక్రమంలో పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కార్మికుల సహనాన్ని బలహీనతగా భావిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికుల హక్కులను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. వెంటనే 12వ వేజ్ బోర్డును ఏర్పాటు చేసి వేతన సవరణ పూర్తి చేయాలని, కార్మిక హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక నాయకులు మాట్లాడుతూ, సింగరేణికి కోట్లాది రూపాయల లాభాలు తెచ్చిపెడుతున్న కార్మికులకు రావాల్సిన హక్కులను నిరాకరించడం అన్యాయమన్నారు. 12వ వేజ్ బోర్డు ఏర్పాటులో జాప్యాన్ని వెంటనే తొలగించాలని, లేబర్ కోడ్స్ పేరుతో శ్రమ చట్టాలను బలహీనపరిచే ప్రయత్నాలను కార్మిక ఉద్యమం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. అవసరమైతే సమ్మెలు, ముట్టడులు, నిరవధిక ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని, సింగరేణి చరిత్రలో కార్మికులకు లభించిన ప్రతి హక్కు ఉద్యమాల ద్వారానే సాధించబడిందని నాయకులు గుర్తు చేశారు. ఈసారి కూడా కార్మికుల ఐక్యతతో తమ హక్కులను సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మహా ధర్నా సందర్భంగా "12వ వేజ్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి - నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి" అనే నినాదాలతో కొత్తగూడెం హెడ్ ఆఫీస్ పరిసరాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె. సారయ్య, వీరభద్రయ్య, వై.వి.రావు, ముస్కే సమ్మయ్య, వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు మల్లికార్జున్, రమణమూర్తి, నజీర్, మేకల ఈశ్వర్, సుధాకర్, గట్టయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, త్యాగరాజన్, లక్ష్మారెడ్డి, ఆల్బర్ట్, పీతంబరం, రజాక్, సీఐటీయూ నాయకులు మంద నర్సింహారావు, రాజిరెడ్డి, విజయగిరి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ నాయకులు కృష్ణప్రసాద్, ఆంజనేయులు, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో కార్మికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హైవే అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే కూనంనేని ఆగ్రహం

రామవరం గోధుమవాగు బ్రిడ్జిపై గుంతల మరమ్మత్తు పనుల పరిశీలన

ప్రజలకు ఇబ్బందులు లేకుండా రవాణా సౌకర్యం వెంటనే పునరుద్ధరించాలని ఆదేశం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 01 (వార్త సంధ్య) :** నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. రామవరం గోధుమవాగు బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గుంతల తాత్కాలిక మరమ్మత్తు పనులను బుధవారం మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జాతీయ రహదారుల నిర్వహణ బాధ్యత కలిగిన నేషనల్ హైవే అథారిటీ ప్రమాదకరంగా మారిన గుంతలను శాశ్వతంగా పూడ్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దీంతో ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మత్తు పనులు చేపట్టామని తెలిపారు. ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, నిలిచిపోయిన రవాణా సౌకర్యాన్ని వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే అధికారులు ఇకనైనా స్పందించి, తమ పరిధిలోని రహదారులపై ఉన్న గుంతలను శాశ్వతంగా పూడ్చి వాహనదారుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో రవాణా సౌకర్యాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, వివిధ పథకాల ద్వారా రోడ్లు, వంతెనలు, అంతర్గత రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, మున్సిపల్ కమిషనర్ సుజాత, కార్పొరేటర్ కూరపాటి సుధాకర్, నాయకులు భూక్యా శ్రీనివాస్, నగేష్, మున్సిపల్ ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం

## పాల్గొన్న అరికెపూడి గాంధీ, వడ్డేపల్లి రాజేశ్వరరావు




**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీ రిక్రియేషన్ క్లబ్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేర్లింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు శిబిరంలోని వైద్యులతో మాట్లాడి, అందిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రోటరీ సభ్యులను, వైద్య బృందాన్ని వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ శిబిరంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# చంద్రుగొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బియల్ లకు ఐడి కార్డుల పంపిణీ



**చంద్రుగొండ ప్రతినిధి, ప్రతినిధి (వార్త సంధ్య) జులై 30 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు నల్లమోతు వెంకటరమణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు (దీూా) ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె. నరసింహారావు, బుంగ శ్రీనివాసరావు, ఎస్.కే. ఇమ్రాన్ పాషా, కడియాల పుల్లయ్య, రాధాకృష్ణ, చాపలమడుగు మనోహర్లకు ఐడి కార్డులను అందజేశారు. దీూాల ద్వారా ఓటరు జాబితా నిర్వహణ, బూత్ స్థాయి సమన్వయం మరింత బలోపేతం అవుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు మాలోత్ బొజ్యా నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిన్నం శెట్టి మహేష్, దీూా చంద్రుగొండ మండల కో-ఆర్డినేటర్ మేడరాజుల దిలీప్, సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, మండల మహిళా అధ్యక్షురాలు బడుగు కృష్ణవేణి, ఉపసర్పంచ్ అంతటి రామకృష్ణ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు అన్వర్ హుస్సేన్, మండల నాయకులు పారుపల్లి భాస్కరరావు, రావికంపాడు గ్రామ శాఖ అధ్యక్షులు భోగిబోయిన కోటేశ్వరరావు, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

# చంద్రుగొండలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన వాసవి క్లబ్

ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఈ. రాముకు శాలువా కప్పి సత్కరించిన వాసవి క్లబ్ సభ్యులు




**చంద్రుగొండ ప్రతినిధి, ప్రతినిధి (వార్త సంధ్య) జులై 30 :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రుగొండ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ మండల అధ్యక్షులు వీఎన్ కుక్కడపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఈ. రాము ని పూల బుకే అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. వైద్య వృత్తి సమాజానికి ఎంతో గొప్ప సేవ అని పేర్కొంటూ, ప్రతి వైద్యుడికి జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వీఎన్ సంకా సునీల్ కుమార్, ట్రెజరర్ వీఎన్ కుక్కడపు కుశల్ ప్రసాద్, ఆర్యవైశ్యులు కృష్ణారావు, కుక్కడపు నరేష్, కొదుమూరి సత్యనారాయణ, కుక్కడపు కిరణ్, కుక్కడపు గణేష్, కుక్కడపు సాయి, కుక్కడపు చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# తాటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ మండల కమిటీ



చంద్రుగొండ ప్రతినిధి **ప్రతినిధి (వార్త సంధ్య) జులై 30 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను చంద్రుగొండ బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేస్తూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రేపల్లెవాడ సర్పంచ్ ఇర్పా స్రవంతి, మాజీ వైస్ ఎంపీపీ నరుకుల్ల సత్యనారాయణ, టౌన్ పార్టీ అధ్యక్షులు సూరా వెంకటేశ్వర్లు, వైస్ సర్పంచ్ బానోత్ బాలు, సొసైటీ డైరెక్టర్ రాందాస్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

మంథని పిఏసీఎస్ పర్సన్ ఇంచార్జీ కొత్త శ్రీనివాస్



**మంథని, జూలై 01(వార్త సంధ్య) :** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మంథని పిఏసీఎస్ పర్సన్ ఇంచార్జీ కొత్త శ్రీనివాస్ కోరారు. బుధవారం మంథని మండలం పుట్టపాక గ్రామంలో ఇంటిం టికి తిరుగుతూ గ్రామస్తులకు ఎస్ఐఆర్ ఫారాలను అందజేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంథని పిఏసీఎస్ పర్సన్ ఇంచార్జీ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ఎస్ఐఆర్ ఫారాల ద్వారా తమ ఓటు హక్కును తప్పకుండా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. గ్రామంలోని యువతీ యువకులు, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నూరి రాజబాబు. ఉప సర్పంచ్ ఎడ్ల శ్రవణ్ కుమార్, వార్డు సభ్యులు కన్నూరి సుదర్శన్, కన్నూరి వసుంధర సదానందం. బి ఎల్ ఓ కన్నూరి శ్రీలత, కొమ్ము శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు శీలం ప్రభాకర్, ఆకుల సురేష్, మిట్ట కొమురయ్య, కొత్త సతీష్. పాల్గొనడం జరిగింది

# హెచ్ఏఎల్ మెడికల్ సెంటర్‌లో వైద్యులకు ఘన సత్కారం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** డాక్టర్స్ డే సందర్భంగా హిందూస్తాన్ ఏరో నాటిక్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హెచ్.ఎ.ఎల్ మెడికల్ సెంటర్ వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ చీఫ్ డా. సుమంత్ చంద్రతో పాటు వైద్యులు డా. యమున వాణి, డా. నిఖిల్‌లను యూనియన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాలు కప్పి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. రాత్రింబవళ్లు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ల అంకితభావాన్ని, వారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సమాజంలో వైద్యుల పాత్ర ఎనలేనిదని, వారి సేవలకు హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఉ కన్వీనర్ వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్, కర్క నాగరాజు, జాయింట్ సెక్రటరీలు వడ్డే నాగార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం వంతెనపై నుంచి గోదావరిలోకి దూకిన మహిళ..


### స్థానికుల సాహసంతో ప్రాణాపాయం తప్పింది



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 01 (వార్త సంధ్య) :** భద్రాచలం వంతెనపై నుంచి ఓ మహిళ గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వంతెనపై ఉన్న స్థానికులు వెంటనే స్పందించి నదిలోకి దిగి మహిళను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో ఆమె ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రాథమిక విచారణలో ఆమె మతిస్థిమితం సరిగా లేదని, ఇటీవల కుటుంబ సభ్యులు ఆమెను వదిలివెళ్లినట్లు స్థానికులు తెలిపారు. మహిళను వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించిన పోలీసులు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనతో వంతెనపై కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## రూ.2.17 కోట్ల సంక్షేమ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కూనంనేని

### కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ - సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఆర్థిక సాయం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 01 (వార్త సంధ్య) :** పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొత్తం రూ.2.17 కోట్ల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 144 మంది లబ్ధిదారులకు రూ.1,60,00,704, అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ కింద 143 మంది లబ్ధిదారులకు రూ.57,34,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం పేద కుటుంబాలు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ పేద కుటుంబంలోనూ వివాహం ఆగిపోకూడదన్నదే ఈ పథకాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అదేవిధంగా, అనారోగ్యం లేదా అత్యవసర పరిస్థితుల్లో వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలా మారిందని, ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్న సంక్షేమ పథకమని తెలిపారు. నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరబాబు, సొసైటీ చైర్మన్ హనుమంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణ ప్రసాద్, ప్రసాద్, కార్పొరేటర్లు, నాయకులు వాసిరెడ్డి మురళి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో వైభవంగా మహా కుంభాభిషేకం..

### స్వామివారిని దర్శించుకున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి శాంతినగర్‌లోని శ్రీ గీతా కామేశ్వరి దివ్య క్షేత్రంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ట మరియు మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతోంది. ఈ మహోత్సవానికి విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు శ్రీశ్రీశ్రీ దత్తేశ్వరానందభారతి స్వామివారిని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు అందుకున్నారు.అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. సమాజంలో భక్తి భావాన్ని, ధర్మ మార్గాన్ని పెంపొందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గీతా కామేశ్వరి దివ్య క్షేత్రంలో జరుగుతున్న ఈ మహా కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత విజయవంతంగా జరగాలని, భక్తులందరికీ ఆ స్వామివారి ఆశీస్సులు లభించి అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## బొగ్గు గని కార్మికులకు 12వ వేతన కమిటీ ప్రక్రియ వెంటనే ఏర్పాటు చేయాలి

### వేతన కమిటీకి ఆటంకంగా ఉన్న 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలి

### శ్రీ12వ వేజ్ బోర్డు వెంటనే - 40% ఫిట్మెంట్‌తో ఇవ్వాలి

### గనులు, డిపార్ట్మెంట్ ల పై నల్ల బ్యాడ్జీలు ధరించి అధికారుల కు వినతి పత్రాలు ఇచ్చిన జేఏసీ నాయకులు



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, గోదావరిఖని, జులై 01(వార్త సంధ్య) :** బొగ్గు గని కార్మికులకు 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పంద ప్రక్రియను వెంటనే ఏర్పాటు చేయాలని, దీనికి అడ్డుగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ - ఏఐటీయూసీ , ఐఎన్టిసి , సీఐటీయూ , హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. బుధవారం సింగరేణి ఆర్జీ -× ఏరియాలోని జిడి కే -11వ ఇంక్లైన్ మరియు జిడికే -2వ ఇంక్లైన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమాల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 4 లేబర్ కోడ్లు రద్దు చేసి, నూతన వేతన కమిటీని 40% ఫిట్మెంట్ బెనిఫిట్‌తో 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేసి వేతన ఒప్పంద ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి, 12వ వేతన ఒప్పంద చర్చలను ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించాలి, దశాబ్దాల పాటు పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసే ప్రతి ప్రయత్నాన్ని తిప్పికొడతామని వారు హెచ్చరించారు. జూలై 1 న దేశవ్యాప్తంగా జరగనున్న ఆందోళన కార్యక్రమాల్లో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొన్నారని వారు పేర్కొన్నారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు భారీ సంయుక్త ధర్నాను బుధవారం నిర్వహించామని వారు తెలిపారు. ఈ ధర్నా లో జేఏసీ అగ్ర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారని వారు పేర్కొన్నారు. కోట్లాది రూపాయల లాభాలను ఆర్జిస్తున్న బొగ్గు పరిశ్రమలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు న్యాయమైన వేతన ఒప్పందాన్ని అమలు చేయకుండా కాలయాపన చేయడం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్లను పూర్తిగా రద్దు చేసి, 12వ వేతన ఒప్పంద ప్రక్రియ ప్రారంభించే వరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకపోతే దేశవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల ఐక్యశక్తి ముందు కార్మిక వ్యతిరేక విధానాలు నిలవవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులతో పాటు ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్ బాబు, ఎస్.వెంకట్ రెడ్డి, సిద్దమల్ల రాజు, చక్రపాణి, దొంత సాయన్న, కే . శ్రీనివాస రావు, చెప్యాల భాస్కర్‌లి, పిట్ కార్యదర్శులు మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, గొడిశల నరేశ్, బలుసు రవి, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, దాసరి అనిల్, రెడ్డి వెంకట స్వామి, ఇజ్జగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు సమాజానికి దైవ సమానులు

### : కాంగ్రెస్ నాయకులు గొట్టుముక్కల జస్వంత్ రావు (దేశల్)



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** అంతర్జాతీయ డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొట్టుముక్కల జస్వంత్ రావు (దేశల్) ప్రముఖ వైద్యులను ఘనంగా సన్మానించారు. సీనియర్ వైద్యులు డాక్టర్ బి.వై.సి. మద్దయ్య ని దేశల్ శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గొట్టుముక్కల జస్వంత్ రావు మాట్లాడుతూ... సమాజ ఆరోగ్యమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తూ, నిరంతరం సేవలందిస్తున్న వైద్యులందరికీ డాక్టర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా, నిరుపేదలకు సైతం సేవా భావంతో వైద్యమందిస్తూ ప్రాణాలను కాపాడే డాక్టర్ల సేవలు వెలకట్టలేనివని, వారు సమాజానికి దైవ సమానులని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో భాగ్యనగర్ కాలనీ వాసులు, దేశల్ మిత్ర మండలి సభ్యులు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో కళా వైభవం... కడ్డీ తంత్రి వాద్య సంగీతం -- గౌడ పురాణం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన అపూర్వ ప్రదర్శనలు




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 2 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 92వ రోజు (01-07-2026) రవీంద్రభారతి, పాల్కురికి సోమన్న మూల వేదిక మరోసారి జానపద కళల వైభవానికి నిలయంగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల సౌరభాన్ని ప్రతిబింబించే రెండు అరుదైన జానపద కళారూపాలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించి విశేష ప్రశంసలు అందుకున్నాయి. మొదటగా పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్ మండలం, గర్రెపెల్లి గ్రామానికి చెందిన కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ దురిశెట్టి రామయ్య బృందం ప్రదర్శించిన కడ్డీ తంత్రి వాద్య సంగీతం సభలో ఆధ్యాత్మిక, జానపద సంగీత మాధుర్యాన్ని విరజిమ్మింది. తంత్రి స్వరాల విన్యాసాలు, కళాకారుల అద్భుత ప్రతిభ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయగా, సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. అనంతరం మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురు మండలం, వావిలాల గ్రామానికి చెందిన ముల్లంగిరి అంజయ్య గౌడజెట్టి బృందం ప్రదర్శించిన గౌడ పురాణం సంగీతం, నృత్యం, అభినయాల సమ్మేళనంగా సాగి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గౌడ సమాజ చరిత్ర, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను హృద్యంగా ఆవిష్కరించిన ఈ ప్రదర్శనకు ప్రేక్షకులు హర్షధ్వానాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీబోర్డుపై సైదుబాబు, తబలాపై బిక్షపతి, చైతన్య, ఏరుకొండ ప్రసాద్ తమ వాద్య సహకారంతో కార్యక్రమాన్ని మరింత రసవత్తరంగా తీర్చిదిద్దగా, గాయక బృందం తమ గానంతో కళారూపానికి మరింత శోభ తీసుకొచ్చింది. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన “ప్రభాత బేరి” గీతాలతో పాటు జానపద, సామాజిక చైతన్య గీతాలను ఆలపించి సభలో ఉత్తేజభరితమైన వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్, సహాయ సంచాలకులు పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. విజయ్ కుమార్ కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే సాంస్కృతిక సలహా మండలి సభ్యులు బాద్మి శివకుమార్, ముచర్ల దినకర్ కార్యక్రమంలో పాల్గొని కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమానికి విద్యానందాచారి శ్రీనివాస రాజులు వ్యాఖ్యాతలుగా వ్యవహరించి తమ చక్కని వ్యాఖ్యానంతో ప్రతి కళారూపం విశిష్టతను ప్రేక్షకులకు చేరవేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు నడిపించారు.

## అడవి సోమన్ పల్లి సర్ అవగాహనతో ఓటర్లను చైతన్యపరిచిన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి సెగ్గం



**మంథని, జూలై 01 (వార్త సంధ్య ) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమంలో భాగంగా మంథని మండలంలోని అడవి సోమనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు, సవరణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు సర్ విధి విధానాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడవి సోమనపల్లి గ్రామ సర్పంచ్ గట్టు దామోదర్, ఉపసర్పంచ్ అనిల్, వార్డు సభ్యులు పాగే శివశంకర్, సారయ్య, రాకేష్, ఆకుదారి మల్లేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండీ పి. కృష్ణారెడ్డి ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో సమావేశమయ్యారు.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 2. :** ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ, హైదరాబాద్ మెట్రోరైల్ అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి పాల్గొన్నారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో భవిష్యత్తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక సదుపాయంఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ఆలోచనలను సమావేశంలో వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వారు సమావేశంలో వివరించారు. నగరంలో అత్యాధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్స్ వినియోగం వల్ల ప్రయోజనాలను తెలిపారు. సెన్సర్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎలా తోడ్పతుందన్న అంశాలను వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా సిగ్నళ్ల వ్యవస్థ, నీటి లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మార్గం సుగమం చేయడం వంటి కాగ్నిటివ్ సిటీస్ రూపకల్పనకు ఉన్న విస్తృత అవకాశాలను సమావేశంలో సమావేశంలో వివరించారు. వేగంగా పెరుగుతున్న పట్టణాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ప్రభుత్వాల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పౌరులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడం, అలాగే డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళికకు ఎలా దోహదపడతాయో ఇరు సంస్థలు వివరించాయి. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి ఇటు సంస్థలకు పలు సూచనలు చేశారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేలా ఏ× కి అనుసంధానించాలని సీఎం సూచించారు. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో అవగాహన ఒప్పందం కుదిరింది. పరస్పరం సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందం కీలకంగా మారుతుంది.

## కాజా మొయినుద్దీన్ కుటుంబాన్ని పరామర్శించిన బి ఆర్ఎస్ నేత ఆనంద్ కుమార్ గౌడ్




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 2 :** నాంపల్లి నియోజకవర్గం శాంతినగర్ లో పరామర్శ కార్యక్రమం గత 23వ తేదీన జరిగిన కారు ప్రమాదంలో ప్రముఖ న్యాయవాది కాజా మొయిజుద్దీన్ మృతి చెందిన విషయం అత్యంత విషాదకరం. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేయడానికి వారిని పరామర్శించడానికి మాజీ మంత్రివర్యులు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాంపల్లి నియోజకవర్గంలోని శాంతినగర్‌కు విచ్చేస్తున్నారు. కావున పార్టీ కార్యకర్తలు, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు అనుబంధ విభాగాల నాయకులు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయవలసిందిగా మనవి చేస్తున్నాను.


## వేపలగడ్డలో తీవ్ర డ్రైనేజీ సమస్య

### వర్షపు నీరు నిల్వతో ప్రజల అవస్థలు

### అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**భద్రాద్రి, జూలై 01 (వార్త సంధ్య) :** సుజాతనగర్ మున్సిపాలిటీ పరిధిలోని వేపలగడ్డ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు కాలువల్లో నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో కాలువలు నిండిపోవడంతో రహదారుల వెంట




నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. నిల్వ నీటి కారణంగా దోమల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు, చిన్నారులు, వృద్ధులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ కాలువలను వెంటనే శుభ్రపరచి నిల్వ నీటిని తొలగించాలని, శాశ్వత పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. అలాగే దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలను అత్యవసరంగా చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సారపాకలో రూ.2.90 కోట్ల గంజాయి పట్టివేత

### కంటైనర్ లారీలో రహస్య గది..

### ఒడిశా నుంచి యూపీకి స్మగ్లింగ్ - ముగ్గురు అరెస్ట్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 01 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో పోలీసులు భారీ గంజాయి స్మగ్లింగ్‌ను భగ్నం చేశారు. ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న రూ.2.90 కోట్ల విలువైన 581 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, కంటైనర్ లారీతో పాటు ఎస్కార్ట్‌గా ఉపయోగించిన బజాజ్ పల్సర్ మోటార్‌సైకిల్‌ను సీజ్ చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మంగళవారం సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా వెళ్తున్న కంటైనర్ లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో ప్రత్యేకంగా నిర్మించిన రహస్య గదిలో అత్యంత చాకచక్యంగా దాచిపెట్టిన 581 కిలోల గంజాయి బయటపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.2,90,58,000 ఉంటుందని అధికారులు అంచనా వేశారు. లారీకి ఎస్కార్ట్‌గా వస్తున్న బజాజ్ పల్సర్ బైక్‌పై ఉన్న వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన సహదేవ్, సురేష్ కుమార్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలానికి చెందిన డోగ్రి త్రినాథ్‌ను అరెస్ట్ చేశారు. నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించారు. ఈ స్మగ్లింగ్ ముఠాలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరికొందరు సభ్యులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో పలు రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. త్వరలోనే మిగతా నిందితులను కూడా అరెస్ట్ చేస్తామని డీఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.

# యూట్యూబ్‌లో చూసి హత్య

**24 గంటల్లోనే కేసు ఛేదించిన కరీంనగర్ పోలీసులు**

**హత్య ఎలా చేయాలో యూట్యూబ్‌లో చూసి నేర్చుకున్న నిందితుడు**

**వివాహేతర సంబంధం, అవమానాలే హత్యకు కారణమని వెల్లడి**

**పీరీల పండుగ నుంచి వస్తుండగా ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్య**

**నిందితుడి నుంచి మొబైల్ ఫోన్, హత్యకు వాడిన ఆయుధం స్వాధీనం**



తెలంగాణలోని కరీంనగర్‌లో దారుణ హత్యోదంతం చోటుచేసుకుంది. హత్య ఎలా చేయాలో యూట్యూబ్ వీడియోలలో చూసి, ఓ వ్యక్తిని అత్యంత కిరాతకంగా చంపిన నిందితుడిని పోలీసులు కేవలం 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. ఈ కేసులో బంగారపు మహేష్ (40) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు పైతరి మొగిలి (52) ఓ వివాహితపై అత్యాచార యత్నం కేసులో జైలుకు వెళ్లి ఇటీవల విడుదలయ్యాడు. అయితే, జైలు నుంచి వచ్చాక కూడా అతను తన పద్ధతి మార్చుకోలేదు. ఆ మహిళను వేధించడం కొనసాగించాడు. అదే మహిళతో వివాహేతర సంబంధం ఉన్న నిందితుడు మహేష్‌ను కూడా మొగిలి తరచూ అవమానించేవాడు. వారి సంబంధం గురించి చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం చేస్తూ, మహేష్ పరువు తీస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు కూడా జరిగాయి.మొగిలి నుంచి ఎదురవుతున్న నిరంతర వేధింపులు, అవమానాలు భరించలేకపోయిన మహేష్, అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం యూట్యూబ్‌లో హత్యలు ఎలా చేయాలి, ఆయుధాలు ఎలా సిద్ధం చేసుకోవాలి వంటి వీడియోలు చూసి పక్కా ప్రణాళిక రచించాడు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపిన వివరాల ప్రకారం.. "శనివారం రాత్రి మడిపల్లి గ్రామంలో జరిగిన పీరీల పండుగకు హాజరై మొగిలి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా, ఓ కల్వర్టు వద్ద కాపుకాచిన మహేష్ వెనుక నుంచి ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. తలపై పలుమార్లు బలంగా కొట్టి, అతను చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత ఇంటికి వెళ్లి, రక్తంతో తడిసిన బట్టలు మార్చుకుని పరారయ్యాడు" అని వివరించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా మహేష్‌ను ప్రశ్నించగా, తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్, యూట్యూబ్ సెర్చ్ హిస్టరీ ఉన్న మొబైల్ ఫోన్, బైక్, హత్య సమయంలో ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడకుండా నిందితుడిపై రౌడీ షీట్ తెరిచేందుకు కూడా జిల్లా పోలీసులు యోచిస్తున్నారు.

# వీడని చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ మిస్టరీ

**తుని పోలీసులు కీలక ప్రకటన**

**కాకినాడ జిల్లా తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యంపై వీడని ఉత్కంఠ**

**పాప ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష రివార్డు ప్రకటించిన పోలీసులు**

**చిన్నారి ఫొటోతో రాష్ట్రవ్యాప్తంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాల పంపిణీ**

**25 రోజులుగా గాలిస్తున్నా లభించని చిన్నారి ఆనవాళ్లు**

**కిడ్నాప్ కోణంలో దర్యాప్తు చేసినా దొరకని ఆధారాలు**






కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారానికి చెందిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో మిస్టరీ 25 రోజులుగా కొనసాగుతూనే ఉంది. పాప ఆచూకీ కోసం పోలీసులు తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. చిన్నారి సమాచారం అందించిన వారికి రూ.లక్ష నగదు పారితోషికం ఇస్తామని ప్రకటించారు.ఈ మేరకు చిన్నారి ఫొటో, గుర్తింపు వివరాలతో కూడిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కాకినాడ జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో ఈ పోస్టర్లను అంటిస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు. పాప గురించి తెలిస్తే 9440796508, 9440796531, 9440796573 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తుని పోలీసులు ప్రజలను కోరారు.చిన్నారి అదృశ్యమైనప్పటి నుంచి ఇప్పటివరకు 12 ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అటవీ ప్రాంతంతో పాటు సమీపంలోని వాగులు, వంకలను జల్లెడపట్టాయి. అయినా చిన్నారి ఆనవాళ్లు లభించలేదు. మరోవైపు, జీడిపిక్కలు ఏరేందుకు సమీప గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చేవారికి పాప వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. పాపను ఎవరైనా కిడ్నాప్ చేశారా అనే కోణంలోనూ దర్యాప్తు చేసినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. అడవి జంతువులు ఏమైనా దాడి చేశాయా అనే అనుమానంతో బొమ్మను, మాంసాన్ని సంఘటనా స్థలంలో ఉంచి చూసినా ఫలితం లేకుండా పోయింది.జూన్ 6వ తేదీ మధ్యాహ్నం 11.50 గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న జ్ఞానేశ్వరి కనిపించకుండా పోయింది. పాపతో పాటు వెళ్లిన వారి పెంపుడు శునకం కూడా అదృశ్యమైంది. కొన్ని రోజులకు ఆ శునకం తిరిగి ఇంటికి చేరినప్పటికీ, దాని ద్వారా పాప ఆచూకీ లభించలేదు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆ శునకం కూడా మృతి చెందింది.పాప కనిపించకుండా పోయిన రోజు, ఆ శునకం ఊరిలోని ప్రధాన రహదారిపై ఆందోళనగా తిరుగుతున్న దృశ్యాలు సమీపంలోని ఆలయ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కానీ, అది ఎటువైపు వెళ్లిందనే దానిపై స్పష్టత రాలేదు. దాదాపు నెల రోజులు కావస్తున్నా పాప ఆచూకీ లభించకపోవడంతో, ఇప్పుడు ప్రజల నుంచి అందే సమాచారంపైనే పోలీసులు ఆశలు పెట్టుకున్నారు.

# పోలీసులపై కత్తితో దాడికి యత్నం

**ఆత్మరక్షణ కోసం నిందితుడిపై పోలీసుల కాల్పులు**

**ఏపీకి చెందిన భూష్మి శ్రీకాంత్‌గా గుర్తింపు**

**నిందితుడిపై 10కి పైగా ఆస్తి, నేరాల కేసులు**

**హైదరాబాద్‌కు వెళ్లిన నల్గొండ సీసీఎస్ బృందం**

**చికిత్స అనంతరం నల్గొండకు తరలింపు**



ఓ వ్యక్తి గత కొంతకాలంగా నల్గొండ జిల్లా కేంద్రంతో పాటు ఇతర చోట్ల దొంగతనాలు చేస్తున్నాడు. అతన్ని పట్టుకునేందుకు నల్గొండ పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లారు. అదుపులోకి తీసుకొనే క్రమంలో నిందితుడు పోలీసులపై దాడి చేసేందుకు ప్రయత్నం చేశారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నిందితుడి కాలికి గాయమైంది.పోలీసుల కథనం ప్రకారం నిందితుడు ఏపీకి చెందిన భూష్మి శ్రీకాంత్‌పై పదికి పైగా ఆస్తి, నేరాల కేసులు ఉన్నాయని, నాలుగేళ్ల క్రితం ఏపీలో ఓ కానిస్టేబుల్‌ను హత్య చేసిన కేసు కూడా ఉన్నట్లు సమాచారం. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో అతను హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం వచ్చింది. దీంతో సీసీఎస్ బృందం మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లింది.రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల సమీపంలో అవుటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఫస్ట్ సర్వీస్ రింగ్ రోడ్డుపై సీసీఎస్ నల్గొండ పోలీసులు అనుమానంతో డీసీఎం వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో నిందితుడు శ్రీకాంత్ తన వద్ద ఉన్న కత్తితో పోలీసులపై దాడికి ప్రయత్నించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో శ్రీకాంత్ రెండు కాళ్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.ప్రస్తుతం నిందితుడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అనంతరం సీసీఎస్ పోలీసులు శ్రీకాంత్‌ను నల్గొండకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. తమ కానిస్టేబుల్‌ను చంపేందుకు యత్నించాడని నిడమానూరు ఎస్ఐ ఫిర్యాదు చేశారు. దీంతో ఆదిభట్ల పీఎస్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు నిందితుడిపై ఉన్న పాత ఆస్తి నేరాల వివరాలను సేకరిస్తున్నారు.

# ఓర్చుకోలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారు: మల్లు రవి

**తెలంగాణలో రాముడి ఆదర్శ పాలన సాగుతోందన్న మల్లు రవి**

**అయోధ్య రాముడి సొమ్మును బీజేపీ దిగమింగిందని ఆరోపణ**

**రాహుల్ ప్రధాని కావడం ఖాయమని ధీమా**



తెలంగాణలో సాగుతోంది రాముడి ఆదర్శ పాలన అని ఆ పార్టీ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. దేవుడి సొమ్మును కూడా దిగమింగిన బీజేపీకి ఇక పుట్టగతులుండవు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వజన సంక్షేమమే ధ్యేయంగా దూసుకుపోతుంటే, ఓర్వలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణలో ఉనికి కోసం ఆరాటపడుతున్న బీజేపీ... దేశంలో అత్యంత అవినీతి, నియంతృత్వ ధోరణులతో ఒక 'రావణాసుర పాలన' సాగిస్తోందని మల్లు రవి ధ్వజమెత్తారు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన ఒక 'అట్టర్ ఫ్లాప్ షో' అని ఎద్దేవా చేశారు. ఇక్కడ కాంగ్రెస్‌ను గద్దె దించడం ఎవరి వల్లా కాదని, తెలంగాణ సమాజం మత విద్వేష రాజకీయాలను ఎన్నటికీ ఆదరించదని స్పష్టం చేశారు.అయోధ్య రాముడి పేరుతో 40 ఏళ్లుగా రాజకీయం చేస్తున్న బీజేపీ... చివరకు ఆ దేవుడి సొమ్మును కూడా వదలకుండా మింగేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. స్వయంగా యూపీలోని అయోధ్య వాసులే ఆ పార్టీ అవినీతిపై ఆగ్రహంతో ఉన్నారని, దేశంలో కమలం పార్టీకి కాలం చెల్లిందన్నారు. విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీకి రాబోయే సార్వత్రిక ఎన్నికలే చివరివని, త్వరలోనే దేశం 'బీజేపీ ముక్త్ భారత్' కాబోతుందని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీయడం, రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజా పాలన ప్రగతి కార్యక్రమం



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య)జూలై 2 :** రాష్ట్రవ్యాప్తంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈరోజు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.సమీక్షలో జిల్లా స్థాయి నుంచి గ్రామపంచాయతీ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాలపై సమగ్ర నివేదికలను అందించారు. వివిధ జిల్లాల్లో కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించిన నోడల్ అధికారులు తమ క్షేత్ర పర్యటనలో గుర్తించిన సమస్యలు, సవాళ్లను ప్రధాన కార్యదర్శికి వివరించారు. వారు జిల్లా పరిపాలనలు అవలంబించిన అనేక వినూత్న ఉత్తమ పద్ధతులను కూడా హైలైట్ చేసారు, ఇవి సానుకూల ఫలితాలను అందించాయి ఇతర జిల్లాలలో కూడా పునరావృతం కాగలవు. సత్వర తదుపరి చర్యల ఆవశ్యకతను నొక్కిచెప్పిన చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్లతో చర్చలు జరపాలని తక్షణమే శ్రద్ధ వహించాల్సిన ముఖ్యమైన సమస్యలను గుర్తించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలకు ప్రాధాన్యమివ్వాలని ఆయన ఆదేశించారు.

## డాక్టర్స్ డే సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ నగేష్‌కు ఘన సన్మానం

**చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా భావానికి అభినందనలు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 01 (వార్త సంధ్య) :** అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా బూర్గంపాడు మండలంలోని మొరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నగేష్‌ను చేయూత ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి ఆయన అందిస్తున్న నిస్వార్థ వైద్య సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా చేయూత ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్యులు రాత్రింబవళ్లు సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. రోగులను ఆప్యాయంగా పలకరించి, వారికి ధైర్యం చెప్పి చికిత్స అందించడం వైద్య వృత్తికి ఉన్న గొప్పతనమని పేర్కొన్నారు. కేవలం రెండు నెలల క్రితమే మొరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నగేష్ ఇప్పటికే విశేష సేవలందించారని తెలిపారు. ఈ స్వల్ప కాలంలోనే 13కిపైగా ఉచిత ప్రసవాలు విజయవంతంగా నిర్వహించడంతో పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిరుపేదలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందించడంతో పాటు ఉచిత ప్రసవాలకు ప్రాధాన్యత ఇచ్చి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నారని, తల్లి--శిశు ఆరోగ్య పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని కొనియాడారు. డాక్టర్ నగేష్‌తో పాటు ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య, పారామెడికల్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా వైద్య శాఖకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చేయూత ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చేయూత ట్రస్ట్ వైస్ చైర్మన్ కే. నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి మల్లారెడ్డి, సభ్యులు సెనగ మల్లేష్, సీహెచ్‌వో విజయ, హెచ్‌వీలు రమణ, వెంకట నరసమ్మ, ఫార్మసిస్ట్ తులసి, ల్యాబ్ టెక్నీషియన్ రామ నరసయ్య, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలి

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 01 (వార్త సంధ్య) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులపై ఉందని డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య అన్నారు. బుధవారం బూర్గంపాడు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ ఆదేశాల మేరకు అఖిలపక్ష నాయకులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి గృహ గణన దరఖాస్తు పత్రాలను అందజేయాలని, అవసరమైతే వాటిని పూర్తిగా నింపించడంతో పాటు ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరికి ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి పారదర్శకంగా నిర్వహిస్తేనే అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితాలో కొనసాగుతాయని చెప్పారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. సదస్సులో పాల్గొన్న వారు అడిగిన సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చి ప్రక్రియపై మరింత స్పష్టత కల్పించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల వివరాలను ఒకే చోట నమోదు చేసే కుటుంబ వివరాల నమోదు ఎంతో కీలకమని, 2002 సంవత్సరపు ఓటరు జాబితాను ప్రామాణికంగా పరిగణిస్తారని తెలిపారు. ఆధార్‌లో ఉన్న వివరాలకు అనుగుణంగా దరఖాస్తు పత్రాలు నింపాలని, అవసరమైన స్వీయ ప్రకటనపై సంతకాలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వీర్రాజు, వెంకటేశ్వర్లు, ఏఎస్‌వీ ప్రదీప్, గ్రామ పంచాయతీ అధికారులు, అఖిలపక్ష నాయకులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగలు

**రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర విమర్శలు**

**యాదగిరిగుట్ట దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు గురించి తనకు సమాచారం ఇవ్వలేదన్న రాజగోపాల్ రెడ్డి**

**ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని సీఎంపై విమర్శలు**

**కాంగ్రెస్ పార్టీలో అసలైన కాంగ్రెసోళ్లు ఎక్కడున్నారని ప్రశ్న**

యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు నూతన కార్యవర్గ ఏర్పాటుకు సంబంధించి తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని సొంత కాంగ్రెస్ ప్రభుత్వంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. మునుగోడు నియోజకవర్గం యాదాద్రి జిల్లాలోనే ఉన్నప్పటికీ తనకు సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు.ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన నేరుగా విమర్శలు గుప్పించారు. రేవంత్‌కు షోఆఫ్స్ ఎక్కువయ్యాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీనియర్ ఎమ్మెల్యేనైన తనను సంప్రదించి ఉంటే తన నియోజకవర్గం నుంచి ఒక సభ్యుడినైనా బోర్డులో చేర్పించుకునేవాడినని, కనీస ఇంగితజ్ఞానం లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వ ఏకపక్ష పోకడలు నచ్చకనే నల్గొండలో జరిగిన ముఖ్యమంత్రి సభకు తాను వెళ్లలేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటున్నా తమకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. అసలు కాంగ్రెస్‌లో ఒరిజినల్ కాంగ్రెసోళ్లు ఎక్కడున్నారని, ఎక్కడెక్కడి నుంచో కొత్తవాళ్లు వచ్చి అంతా వాళ్లే నడుపుతున్నారని దుయ్యబట్టారు. సీనియర్లను ఎలా గౌరవించాలో కూడా తెలియడం లేదని, నాడు తెలంగాణ కోసం కొట్లాడిన ఒరిజినల్ లీడర్లు రోజురోజుకీ కనుమరుగవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## లక్ష్మణఫలం.. ఇలాంటి ఎన్నో రోగాలను నయం చేసే రామబాణం..!



బాగా అలసిపోయినవారు లక్ష్మణ ఫలం తింటే వెంటనే శక్తిని పుంజుకుంటారు. ఈ పండులో బి విటమిన్లు ఉంటాయి. ఇవి శక్తి ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో యాక్టివ్‌గా మారుతారు. లక్ష్మణ ఫలంలో కాల్షియం, ఫాస్పరస్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా మారుస్తాయి. దీంతో ఆసీతాఫలం, రామాఫలం లాగే లక్ష్మణ ఫలం కూడా ఉంటుంది. దీనిని ఇంగ్లీష్‌లో ఆనోనా మ్యూరికాటా అని అంటారు. లక్ష్మణ ఫలంలో 12 రకాల క్యాన్సర్ కారక కణాలను నిర్మూలించే ఔషధగుణాలు ఉన్నట్లు పలువురు ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. లక్ష్మణఫల చెట్టు బెరడు, ఆకులు, విత్తనాలను ఆయుర్వేద వైద్య తయారీలో వాడుతున్నారు. ఈ పండు తరచూ తినటం వల్ల కడుపులో పురుగులను హరిస్తుంది. విష జ్వరాలను తగ్గించుటకు లక్ష్మణ ఫలాలు బాగా ఉపయోగపడతాయి. లక్ష్మణ ఫలం ఆకులతో తలలో పేలను నివారించేందుకు కూడా ఉపయోగిస్తారు. ఇందుకోస లక్షణ ఫలం ఆకులను ముద్దగా చేసి తలకు పట్టించుకుని బాగా మర్దన చేసుకోవడం జరుగుతోంది. పార్శ్వపు నొప్పి, మధుమేహం, మూత్రకోశ వ్యాధుల చికిత్సలో కూడా లక్ష్మణఫలాన్ని వాడుతున్నారు. బాలింతల్లో పాలు వృద్ధి చెందడానికి కూడా లక్ష్మణఫలం తగిన ఫలితాన్ని ఇస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఈ పండ్ల గింజలను పొడిచేసి నీళ్ళలో కలిపి రాసుకుంటే కండరాల నొప్పులు తగ్గుతాయని వినికిడి. విటమిన్ సి, విటమిన్ బీ1, విటమిన్ బీ2 పుష్కలంగా ఈ ఫలాల్లో లభిస్తుందని పలువురి వైద్యుల అభిప్రాయం. ఇంకా.. ఈ పండులో విటమిన్ సీ, విటమిన్ బీ1, విటమిన్ బీ2.. పుష్కలంగా లభిస్తాయట. కండరాల నొప్పి తగ్గడానికి, బాలింతల్లో పాల వృద్ధికి, పార్శ్వపు నొప్పి, షుగర్, మూత్రకోశ వ్యాధుల చికిత్సలోనూ లక్ష్మణఫలాన్ని ఉపయోగిస్తారట. విటమిన్ సి, విటమిన్ బీ1, విటమిన్ బీ2 పుష్కలంగా ఈ ఫలాల్లో లభిస్తుందని పలువురి వైద్యుల అభిప్రాయం.

### నేరేడు పండ్లు, గింజలు తింటే..

## దెబ్బకు షుగర్ కంట్రోల్!



ఆపిల్, నారింజ, అరటి పండ్లు తప్ప మరే ఇతర పండ్లను ఏడాదంతా దొరకవు. ముఖ్యంగా మన దేశంలో పండే సీజనల్ పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అటువంటి వాటిల్లో నేరేడు పండ్లు ముఖ్యమైనవి. వీటిల్లో విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రతి సీజన్‌లో ఆయా కాలాల్లో వచ్చే సీజనల్ పండ్లు మార్కెట్లో దర్శనమిస్తూ ఉంటాయి. అవి ఆయా ప్రత్యేక సీజన్‌లోనే దొరకుతాయి. అంతేగానీ మానకు కావలసినప్పుడు అవి దొరకవు. కాబట్టి ఏడాది పొడవునా దొరకని సీజనల్ పండ్లను ఎక్కువగా తినడం వల్ల పలు ఆరోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆపిల్, నారింజ, అరటి పండ్లు తప్ప మరే ఇతర పండ్లను ఏడాదంతా దొరకవు. ముఖ్యంగా మన దేశంలో పండే సీజనల్ పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అటువంటి వాటిల్లో నేరేడు పండ్లు ముఖ్యమైనవి. వీటిల్లో విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నేరేడు పండు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. నేరేడు పండులో విటమిన్ సి, బి12, ఐరన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఖనిజాలు, ఫైబర్‌కు ఇవి మూలం. అందువల్ల ఆహారంలో క్రమం తప్పకుండా చేర్చుకోవడం వల్ల మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబతున్నారు.నేరేడు పండ్లు శరీరానికి చల్లదనాన్ని అందిస్తుంది. ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. నేరేడు పండ్లలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. నేరేడు పండ్లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. ఈ పండ్లలో ఆంథోసైనిన్లు ఉంటాయి. ఇవి శరీరంలోని కణాలకు చాలా మంచివని నిపుణులు అంటున్నారు. ఈ పండ్లలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్త పరిమాణాన్ని పెంచడంలో సహాయపడుతుంది. తద్వారా రక్తహీనతను తొలగిస్తుంది. నేరేడు పండ్లలో కేలరీలు చాలా తక్కువగా ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇవి సహాయపడతాయి. ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఫలితంగా, దీనిని తిన్న తర్వాత కడుపు నిండినట్లు అనిపిస్తుంది. ఇది అతిగా తినే అలవాటును నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఆరోగ్యకరమైన వ్యక్తి రోజులో దాదాపు 200 గ్రాముల వరకు నేరేడు పండ్లు తినవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## గిన్నిస్ బుక్ లోకి ఎక్కిన 5 భారతీయ వంటకాలు ఇవే!



భారతీయ వంటకాలు అంటే ప్రపంచవ్యాప్తంగా గుర్తొచ్చేవి వాటి అద్భుతమైన రుచి, ఘుమఘుమలాడే సుగంధ ద్రవ్యాల మేళవింపు. అయితే, మన వంటకాలు కేవలం రుచిలోనే కాదు, వాటి భారీ పరిమాణంతోనూ చరిత్ర సృష్టించాయి. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సంపాదించి, భారతీయ పాకశాస్త్ర నైపుణ్యాన్ని, సామూహిక స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పాయి. అలా గిన్నిస్ బుక్‌కెక్కిన 5 భారతీయ వంటకాల ప్రత్యేకతలు ఏమిటో చూద్దాం.బిర్యానీ ప్రియులకు ఇదొక పండగలాంటి వార్త. 2008లో న్యూఢిల్లీలో ఏకంగా 14.06 టన్నుల (14,060 కిలోలు) బిర్యానీని తయారు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. వేల కిలోల బియ్యం, మాంసం, నెయ్యి, సుగంధ ద్రవ్యాలను ఉపయోగించి, ఎందరో చెఫ్‌లు కలిసి ఈ బృహత్కార్యాన్ని పూర్తిచేశారు. బిర్యానీకి ప్రత్యేకతను తెచ్చిపెట్టే పొరల విధానాన్ని, అసలైన రుచిని ఇంత భారీ పరిమాణంలోనూ చెక్కుచెదరకుండా నిలబెట్టడం వారి నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది.పౌష్టికాహారంగా, సులభంగా జీర్ణమయ్యే వంటకంగా కిచిడీకి మంచి పేరుంది. ఈ సాధారణ వంటకం కూడా గిన్నిస్ రికార్డుల్లో చోటు దక్కించుకుంది. 2017లో న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' కార్యక్రమంలో ప్రముఖ చెఫ్ సంజీవ్ కపూర్ నేతృత్వంలో సుమారు 50 మంది చెఫ్‌ల బృందం 918 కిలోల కిచిడీని వండి వడ్డించారు. రికార్డు నెలకొల్పిన తర్వాత, ఈ కిచిడీని పలు స్వచ్ఛంద సంస్థలకు పంచిపెట్టడం విశేషం. ఇది ఆహారం యొక్క పోషక విలువలతో పాటు సామాజిక బాధ్యతను కూడా గుర్తుచేసింది.తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచిన రికార్డు ఇది. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా, తాపేశ్వరం గ్రామానికి చెందిన మిఠాయి తయారీదారు పీవీవీఎస్ మల్లిఖార్జున రావు (మల్లిక్) ఈ అద్భుతాన్ని సృష్టించారు. 2016లో ఏకంగా 29,465 కిలోల బరువున్న భారీ బూందీ లడ్డూను తయారు చేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. శనగపిండి, పంచదార, నెయ్యి, జీడిపప్పు, యాలకుల వంటి సంప్రదాయ దినుసులతో ఈ మహా లడ్డూను రూపొందించారు. పండుగలకు ప్రత్యేకంగా నిలిచే లడ్డూ, ఈ రికార్డుతో ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది.హైదరాబాద్ నగరం కూడా ఈ జాబితాలో తనదైన ముద్ర వేసింది. 2014లో ఇక్కడి 29 మంది చెఫ్‌ల బృందం కలిసి 16.68 మీటర్ల (సుమారు 54 అడుగుల 8 అంగుళాలు) పొడవైన దోశను తయారు చేసి రికార్డు సృష్టించింది. ఇంత పొడవున్న దోశను తయారుచేయడంలో చెఫ్‌ల మధ్య సమన్వయం, కచ్చితమైన సమయపాలన కీలకంగా నిలిచాయి. ముఖ్యంగా, దోశకు ఉండాల్సిన కాగితంలాంటి పల్చదనం, కరకరలాడే స్వభావాన్ని చివరి వరకు కాపాడటం ఒక పెద్ద సవాలు. ఈ ఘనత సాధించి వారు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.భారతీయుల దైనందిన ఆహారంలో భాగమైన చపాతీ కూడా గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించింది. 2012లో గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో దగడూ సేఠ్ గణపతి మహోత్సవం సందర్భంగా 145 కిలోల బరువున్న అతిపెద్ద చపాతీని తయారు చేశారు. దీనికోసం ప్రత్యేకంగా 3ఇ3 మీటర్ల కొలతలతో ఒక లోహపు పెనాన్ని తయారుచేశారు. డజన్ల కొద్దీ వాలంటీర్లు కలిసి పిండిని రుద్దడం, చపాతీని తిప్పడం, కాల్చడం వంటి పనుల్లో పాలుపంచుకున్నారు. ఇది ఒక సాధారణ వంటకాన్ని సామూహిక ప్రయత్నంతో అద్భుతంగా ఎలా మార్చవచ్చో తెలియజేసింది.

## 200 డిగ్రీల వేడి నీళ్ల నది.. దిగితే అంతే సంగతులు.. ఎక్కడ ఉందంటే.?







ప్రకృతి మనిషికి ఇచ్చిన గొప్ప వరం నదులు. ప్రపంచ వ్యాప్తంగా చిన్న పెద్ద అనేక నదులున్నాయి. నదుల ఒడ్డున అనేక ప్రఖ్యాత నగరాలు . ప్రముఖ క్షేత్రాలు వెలిశాయి. ఎక్కడ నీరు సమృద్ధిగా లభిస్తుందో.. అక్కడ నాగరికత వెల్లువిరుస్తుందనేది అందరికీ తెలిసిన విషయమే.. ఇక నదులు.. వాటి సోయగాలు మనిషికి ఎప్పుడు ఆనందం కలిగిస్తాయి. కెనడా ప్రపంచంలోనే అత్యంధికంగా నదులు కలిగిన దేశంగా గుర్తింపు పొందింది. కానీ అన్ని నదుల విశిష్టతలను తలదాన్నెలా ఒక నది విశిష్టతను కలిగి ఉంది.. ఆ నదిలో నీరు 24 గంటలూ మరుగుతూనే ఉంటుంది. ఈ బాయిలింగ్ నది ఎక్కడ ఉన్నదో తెలుసా! అమెరికాలో అమెజాన్ ప్రదేశంలోని 'పెరు' దేశంలో మయంటుయాకు ప్రాంతంలో ఒక విచిత్రమైన నదిని కనుగొన్నారు శాస్త్రవేత్తలు. కెనడా ప్రపంచంలోనే అత్యంధికంగా నదులు కలిగిన దేశంగా గుర్తింపు పొందింది. కానీ అన్ని నదుల విశిష్టతలను తలదాన్నెలా ఒక నది విశిష్టతను కలిగి ఉంది.. ఆ నదిలో నీరు 24 గంటలూ మరుగుతూనే ఉంటుంది. ఈ బాయిలింగ్ నది ఎక్కడ ఉన్నదో తెలుసా%శా%! అమెరికాలో%శా% అమెజాన్ ప్రదేశంలోని 'పెరు' దేశంలో మయంటుయాకు ప్రాంతంలో ఒక విచిత్రమైన నదిని కనుగొన్నారు శాస్త్రవేత్తలు.అమెజాన్ ప్రదేశంలోని 'పెరు' దేశంలో మయంటుయా ప్రాంతంలో సముద్ర తీరంలో ఒక విచిత్ర నది ఉంది. ఆ నది నీరు 24 గంటలు వేడిగానే ఉంటుంది. అందుకనే ఈ నదిని "బాయిలింగ్ రివర్" అని అంటారు. ఈ నది అడవి మధ్యన ఉంటుంది.. అమెజాన్ ప్రదేశంలోని 'పెరు' దేశంలో మయంటుయా ప్రాంతంలో సముద్ర తీరంలో ఒక విచిత్ర నది ఉంది. ఆ నది నీరు 24 గంటలు వేడిగానే ఉంటుంది. అందుకనే ఈ నదిని "బాయిలింగ్ రివర్" అని అంటారు. ఈ నది అడవి మధ్యన ఉంటుంది. అయినా నీరు 200 డిగ్రీల ఉష్ణోగ్రతతో నిత్యం మరిగిపోతూం టుంది. ఈ నదిని 2011 లో కనుగొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద థర్మల్ నది దాదాపు నాలుగు మైళ్ళ వరకు వేడిగా ప్రవహిస్తుంది. దాని వెడల్పు వద్ద 80 అడుగులు లోతు వద్ద 16 అడుగులు ఉంటుందని శాస్త్రజ్ఞులు చెప్పారు. అయినా నీరు 200 డిగ్రీల ఉష్ణోగ్రతతో నిత్యం మరిగిపోతూంటుంది. ఈ నదిని 2011 లో కనుగొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద థర్మల్ నది దాదాపు నాలుగు మైళ్ళ వరకు వేడిగా ప్రవహిస్తుంది. దాని వెడల్పు వద్ద 80 అడుగులు లోతు వద్ద 16 అడుగులు ఉంటుందని శాస్త్రజ్ఞులు చెప్పారు.ఈ నదిలో నీరు ఏ కాలమైన వేడిగా ఉంటుందని.. ఏ జంతువు ఈ నీటిలో పడినా బతకడం కష్టం అని అంటున్నారు. ఈ నదిలో నీటితో వంట కూడా చేసుకోవచ్చుట.. ఇలా నీరు ఇంతవేడిగా ఉండడానికి కారణం బహుశా నది అడుగున అగ్ని పర్వతం ఉండి ఉంటుంది అని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఈ నదిలో నీరు ఏ కాలమైన వేడిగా ఉంటుందని.. ఏ జంతువు ఈ నీటిలో పడినా బతకడం కష్టం అని అంటున్నారు. ఈ నదిలో నీటితో వంట కూడా చేసుకోవచ్చుట.. ఇలా నీరు ఇంతవేడిగా ఉండడానికి కారణం బహుశా నది అడుగున అగ్ని



పర్వతం ఉండి ఉంటుంది అని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.ఏది ఏమైనా ప్రకృతిపై మనిషి పై చేయి సాధించాను అని భావించినప్పుడల్లా.. ఇదిగో ఈ వింత చూడు.. అని మనిషికి ప్రకృతి సవాల్ విసురుతూనే ఉంటుంది అని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మీరు 'పెరు' వెళ్తే మాత్రం దీన్ని కచ్చితంగా సందర్శించండి. ఏది ఏమైనా ప్రకృతిపై మనిషి పై చేయి సాధించాను అని భావించినప్పుడల్లా.. ఇదిగో ఈ వింత చూడు.. అని మనిషికి ప్రకృతి సవాల్ విసురుతూనే ఉంటుంది అని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మీరు 'పెరు' వెళ్తే మాత్రం దీన్ని కచ్చితంగా సందర్శించండి.

## మన దేశంలో ప్రకృతి అందాల మధ్య యోగా సాధనకు బెస్ట్ ప్లేసెస్ ఇవే..

















ప్రతి సంవత్సరం జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటారు. కనుక మీరు కూడా మొదటిసారి యోగా సాధన చేయబోతున్నా లేదా క్రమం తప్పకుండా చేయబోతున్నా.. ఈ రోజు భారతదేశంలోని కొన్ని ప్రశాంతమైన , సహజ సౌందర్య ప్రదేశాల గురించి తెలుసుకుందాం.. ఈ ప్రదేశాల్లో యోగా చేయడం ద్వారా శాంతిని పొందుతారు. అంతేకాదు శరీరానికి కూడా మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. యోగా ప్రియుల కోసం భారతదేశంలో చాలా అందమైన ప్రదేశాలు ఉన్నాయి. వాటిని అన్వేషించి అక్కడ యోగా సాధన చేయవచ్చు. ఇక్కడ యోగా కూడా నేర్చుకోవచ్చు. అంతేకాదు బిజీ జీవితం నుంచి కొంత సమయం కేటాయించి అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున అనేక యోగాసనాలను సాధన చేయవచ్చు. యోగా సాధన మీ శరీరానికి కూడా ప్రయోజనం చేకూరుస్తుంది. భారతదేశంలో సందర్శించడానికి చాలా ప్రదేశాలు ఉన్నాయి. ఇక్కడ సహజ సౌందర్యాన్ని చూడవచ్చు. అంతేకాదు ఈ ప్రదేశాలు సాహస కార్యక్రమాలకు ఎంతో ప్రసిద్ధి చెందాయి. ఇంట్లో లేదా దగ్గర్లోని పార్కులో యోగా చేయడం ఎవరికైనా విసుగు తెప్పిస్తే.. ఈ యోగా దినోత్సవం రోజున భారతదేశంలోని కొన్ని అందమైన ప్రదేశాలను సందర్శించవచ్చు. పర్వతాలు, చుట్టూ ఉన్న పచ్చదనం అందమైన దృశ్యాలను చూడటంతో పాటు మీరు యోగా చేయగల ప్రదేశాలను ఎంచుకుని ఈ ప్రదేశాలను అన్వేషించవచ్చు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకుంటారు. ఎందుకంటే 2014 డిసెంబర్ 11న, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవాలనే ప్రతిపాదనను ఐక్యరాజ్య సమితిలోని 177 మంది సభ్యులు ఆమోదించారు. భారతదేశం చేసిన ఈ ప్రతిపాదనను 90 రోజుల్లో ఆమోదించారు. 2014 సెప్టెంబర్ 27న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో తన ప్రసంగంలో ప్రపంచ సమాజానికి ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకుంటారు. ఎందుకంటే 2014 డిసెంబర్ 11న, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవాలనే ప్రతిపాదనను ఐక్యరాజ్యసమితిలోని 177 మంది సభ్యులు ఆమోదించారు. భారతదేశం చేసిన ఈ ప్రతిపాదనను 90 రోజుల్లో ఆమోదించారు. 2014 సెప్టెంబర్ 27న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో తన ప్రసంగంలో ప్రపంచ సమాజానికి ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

రిషికేశ్, ఉత్తరాఖండ్: రిషికేశ్‌ను యోగా రాజధాని అని పిలుస్తారు. గంగా నది ఒడ్డుకు వెళ్లి ఇక్కడ యోగా చేయవచ్చు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కూడా ఇక్కడ జరుపుకుంటారు. దీనికి దేశ, విదేశాల నుంచి ప్రజలు వస్తారు. రిషికేశ్‌లో యోగా నేర్చుకోవాలనుకుంటే.. ఇక్కడ పరమార్థ నికేతన్, శివానంద్ ఆశ్రమం, సాధన మందిరం, హిమాలయ యోగా ఆశ్రమం వంటి కొన్ని ప్రదేశాలు ఉన్నాయి. రిధర్మశాల, హిమాచల్ ప్రదేశ్: హిమాలయాల ఒడిలో ఉన్న ధర్మశాల యోగాకు సరైన ప్రదేశం. ఇక్కడ ప్రశాంతమైన వాతావరణం ధ్యానానికి ఉత్తమమైనది. ధర్మశాలలోని సహజ సౌందర్యాన్ని ఆరాధించడం వల్ల యోగా ఆనందం మరింత పెరుగుతుంది. ఇక్కడ భాగ్సు యోగా సెంటర్, సిద్ధి యోగా, యూనివర్సల్ యోగా సెంటర్, యోగా ఇండియా వంటి కొన్ని ప్రసిద్ధ యోగా కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ యోగా నేర్చుకోవచ్చు. గోవా: యోగాకు గోవా ఉత్తమైంది. గోవాలోని ప్రకృతి సౌందర్యం, బీచ్‌లు పార్టీలకు మాత్రమే కాదు యోగాకు కూడా ఉత్తమమైనవి. ఇక్కడ యోగా నేర్చుకునే అనేక యోగా కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. త్రిమూర్తి యోగా సెంటర్, లోటస్ నేచర్, కేర్, బాంబూ యోగా రిట్రీట్, హిమాలయన్ యోగా వ్యాలీ వంటి అనేక రిట్రీట్‌లు, యోగా కేంద్రాలు గోవాలో ఉన్నాయి.

గోవా: యోగాకు గోవా ఉత్తమైంది. గోవాలోని ప్రకృతి సౌందర్యం, బీచ్‌లు పార్టీలకు మాత్రమే కాదు యోగాకు కూడా ఉత్తమమైనవి. ఇక్కడ యోగా నేర్చుకునే అనేక యోగా కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. త్రిమూర్తి యోగా సెంటర్, లోటస్ నేచర్, కేర్, బాంబూ యోగా రిట్రీట్, హిమాలయన్ యోగా వ్యాలీ వంటి అనేక రిట్రీట్‌లు, యోగా కేంద్రాలు గోవాలో ఉన్నాయి.

కేరళ: కేరళ దాని సహజ సౌందర్యానికి మాత్రమే కాదు ఆయుర్వేద చికిత్స , యోగాకు కూడా ప్రసిద్ధి చెందింది. యోగా ప్రియులకు ఇంతకంటే ప్రశాంతమైన , అందమైన ప్రదేశం మరొకటి ఉండదు. ఈ నగరంలో శివ ఋషి యోగా, ఏకం యోగ శాల, ??ఋషికేశ్ యోగాపీఠ్ వంటి అనేక యోగా కేంద్రాలు ఉన్నాయి, ఇక్కడ ఎవరైనా సరే ఆసక్తి ఉంటే యోగాలో శిక్షణ పొందవచ్చు.

పాండిచ్చేరి: చేయడానికి ప్రశాంతమైన ప్రదేశం కోసం చూస్తున్నట్లయితే.. తమిళనాడులోని పాండిచ్చేరి నగరం ఉత్తమమైనది. పాండిచ్చేరి ఆశ్రమాలు యోగా, ధ్యానానికి ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ అనేక రకాల యోగాసనాలు నేర్పించే అనేక శిక్షణా కేంద్రాలు ఉన్నాయి. చందు ఆశ్రమం, తిరుమూలర్ యోగా కేంద్రం, ఆనందమయ యోగా కేంద్రంలో ప్రశాంతంగా యోగా చేయవచ్చు.

ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు ఇంట్లో లేదా తోటలో యోగా చేయడానికి బదులుగా భారతదేశంలోని 5 అందమైన ప్రదేశాల్లోని అందమైన దృశ్యాలను చూస్తూ యోగా చేయవచ్చు. రిషికేశ్ నుంచి గోవా వరకు, యోగాను సులభంగా నేర్చుకోగల అనేక యోగా శిక్షణా కేంద్రాలు ప్రతిచోటా ఉన్నాయి.

## ఆరోగ్యానికి ఏది మంచిది..? నిపుణులు ఏం చెబుతున్నారు..?

చికెన్ అంటే చాలా మందికి ఇష్టం. మార్కెట్ లో తక్కువ ధరలో దొరికేది బ్రాయిలర్ చికెన్ అయినా.. ఆరోగ్యపరంగా దీనికి తక్కువ మార్కులే వేయాలి. ఇది త్వరగా పెరిగేలా మందులు వాడుతారు. కానీ మన పాత కాలపు నాటుకోడి మాత్రం ఆరోగ్యానికి చాలా మంచిదని పేరు పొందింది. బ్రాయిలర్ చికెన్ తక్కువ ధరలో దొరుకుతుంది. కానీ ఇది కృత్రిమంగా పెరుగుతుంది. దాని పెంపకం సమయంలో హార్మోన్లు, యాంటీబయాటిక్స్ వంటివి ఎక్కువగా వాడతారు. దీని వల్ల దీన్ని తరచుగా తినేవారికి కొలెస్ట్రాల్ పెరగడం, తక్కువ రోగనిరోధక శక్తి, హార్మోన్ల సమతుల్యం కాకపోవడం, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు వంటి అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. నాటుకోడి సహజంగా పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో స్వేచ్ఛగా తిరుగుతూ పెరిగే ఈ కోడి శరీరానికి శక్తిని ఇస్తుంది. ఇది ఎలాంటి మందులు లేకుండా పెరిగే కోడి. ఆరోగ్యానికి చాలా మంచిది.

నాటుకోడిలో ప్రొటీన్లు అధికం
కొందరికి అవసరమైన తక్కువ కొవ్వు
శరీరం పెరుగుదలకు సాయపడుతుంది
బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఎంపిక
రోగనిరోధక శక్తికి సహాయపడుతుంది

నాటుకోడి మాంసం శరీరానికి అవసరమైన పోషకాలను ఇస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సాయపడుతుంది. అలసట తగ్గించి శక్తినిస్తుంది. ఇంకా జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో ఇది ఉపయోగపడుతుంది. నాటుకోడిలో ఉండే



విటమిన్ డి, కాల్షియం, బీ12 విటమిన్లు వంటి పోషకాల వల్ల
నరాలు బలపడతాయి
ఎముకలు గట్టిగా అవుతాయి
శారీరక శ్రమ తగ్గి శక్తి పెరుగుతుంది
ఆడవారికి, గర్భిణీ స్త్రీలకు నాటుకోడి

నాటుకోడి గుడ్లలో ఉన్న ప్రొటీన్, కాల్షియం గర్భిణీ స్త్రీలకు, వారి కడుపులోని శిశువులకు అవసరమైన పోషకాలను ఇస్తుంది. పురుషుల్లో నరాల బలహీనత, వీర్యం నాణ్యతకు సంబంధించిన



సమస్యలను కూడా తగ్గించడంలో ఇది సహాయపడుతుంది నాటుకోడి ఆరోగ్యానికి మంచిదైనా బీపీ లేదా కొలెస్ట్రాల్ ఉన్నవారు ఎక్కువగా తినకూడదు. వేయించి తినడం కన్నా కూరగా చేసుకుని గ్రిల్ చేసిన రూపంలో తినడం మంచిది. ఎక్కువ నూనె వాడితే దాని ఆరోగ్య ప్రయోజనాలు తగ్గిపోతాయి. ధర పరంగా బ్రాయిలర్ చికెన్ చవకైనా, ఆరోగ్యానికి హానికరం కావచ్చు. నాటుకోడి అయితే ఖరీదైనా, సహజమైన శక్తిని, పోషకాలను అందించే గొప్ప ఆహారం. క్రమం తప్పకుండా సరైన పద్ధతిలో తీసుకుంటే శరీరానికి ఆరోగ్యం, శక్తిని అందించే మంచి ఎంపిక ఇది.

# ప్రైమ్ వీడియో కస్టమర్లకు అన్యాయం

**అమెజాన్‌ను కోర్టుకు ఈడ్చిన ఆస్ట్రేలియా ప్రభుత్వం**

**ప్రైమ్ వీడియోలో యాడ్స్ వేయడంపై ఆస్ట్రేలియాలో అమెజాన్‌పై కేసు**

**యాడ్స్ లేకుండా చూడాలంటే అదనపు డబ్బులు వసూలు చేయడంపై వివాదం**

**అన్యాయమైన ఒప్పంద నిబంధనలతో వినియోగదారులను మోసం చేసిందని ఆరోపణ**

**లక్షలాది మంది వార్షిక చందాదారులపై ఈ మార్పుల ప్రభావం పడిందని వెల్లడి**

**అమెజాన్‌పై భారీ జరిమానా, వినియోగదారులకు నష్టపరిహారం కోరుతున్న ఏసీసీసీ**




దిగ్గజ ఈ-కామర్స్, టెక్నాలజీ సంస్థ అమెజాన్ ఆస్ట్రేలియాలో తీవ్రమైన చట్టపరమైన ఆరోపణలు ఎదుర్కొంటోంది. తమ ప్రైమ్ వీడియో స్ట్రీమింగ్ సేవలో అకస్మాత్తుగా ప్రకటనలను ప్రవేశపెట్టి, వాటిని తొలగించుకోవాలంటే వినియోగదారుల నుంచి అదనపు రుసుము వసూలు చేయడంపై ఆ దేశ కాంపిటీషన్ వాచ్‌డాగ్ తీవ్రంగా స్పందించింది. వినియోగదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా, అన్యాయమైన ఒప్పంద నిబంధనలను చేర్చారంటూ ఆస్ట్రేలియన్ కాంపిటీషన్ అండ్ కన్స్యూమర్ కమిషన్ (ఏసీసీసీ) అమెజాన్‌పై ఫెడరల్ కోర్టులో దావా వేసింది.

**వివాదానికి కారణమేమిటి?**

ఈ వివాదం 2024లో అమెజాన్ తన ప్రైమ్ వీడియో సేవలో ప్రకటనలను చేర్చడంతో మొదలైంది. ఏసీసీసీ వాదన ప్రకారం.. అప్పటికే వార్షిక చందా చెల్లించిన లక్షలాది మంది సబ్‌స్క్రైబర్లు, ఎలాంటి ముందస్తు స్పష్టత లేకుండా యాడ్స్‌తో కూడిన సేవను పొందాల్సి వచ్చింది. ఎవరైనా ప్రకటనలు లేకుండా మునుపటిలా వీడియోలు చూడాలనుకుంటే, నెలకు అదనంగా 2.99 ఆస్ట్రేలియన్ డాలర్లు చెల్లించాలని అమెజాన్ షరతు విధించింది. ఏడాదికి 79 డాలర్లు చెల్లించి వార్షిక సభ్యత్వం తీసుకున్న వారికి ఇది తీవ్ర అన్యాయమని ఏసీసీసీ ఆరోపించింది. ఈ మార్పులు చేసిన సమయంలో ఇప్పటికే 8.5 లక్షల మందికి పైగా ఆస్ట్రేలియన్ వినియోగదారులు వార్షిక చందా చెల్లించి ఉన్నారు. అదనపు రుసుము చెల్లించని వారికి, వారు డబ్బు చెల్లించిన సేవలో కోత విధించినట్లు అయ్యిందని (డౌన్‌గ్రేడ్) ఏసీసీసీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఏసీసీసీ చైర్ గినా కాస్-గాట్లిబ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. "అమెజాన్ తన వార్షిక ప్రైమ్ ఒప్పందాలలో అనేక అన్యాయమైన నిబంధనలను చేర్చింది. వాటిని అడ్డం పెట్టుకునే ప్రైమ్ వీడియోలో ప్రకటనలను ప్రవేశపెట్టింది" అని వివరించారు.

**కేవలం యాడ్స్ సమస్యే కాదు**

ఈ కేసు కేవలం యాడ్స్ ప్రదర్శనకు మాత్రమే పరిమితం కాలేదు. అమెజాన్ తన ఒప్పందాలలో చేర్చిన ఐదు కీలక నిబంధనలను ఏసీసీసీ లక్ష్యంగా చేసుకుంది. ఈ నిబంధనలు సబ్‌స్క్రైబర్లకు ఎలాంటి వాపసు లేదా సరైన నష్టపరిహారం ఇవ్వకుండానే ప్రైమ్ సేవలలో ఏకపక్షంగా, ముఖ్యమైన మార్పులు చేయడానికి అమెజాన్‌కు అధికారం కట్టబెట్టాయని ఏసీసీసీ వాదిస్తోంది. 2023 నవంబర్ నుంచి 2025 ఆగస్టు మధ్య కాలంలో పది లక్షల మందికి పైగా కస్టమర్లు సంతకం చేసిన ఒప్పందాలలో ఈ నిబంధనలు ఉన్నాయని రెగ్యులేటర్ పేర్కొంది. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీసీసీ ఈ దర్యాప్తును ప్రారంభించింది. ఈ కేసులో అమెజాన్‌కు భారీ జరిమానా విధించాలని, ప్రభావితమైన వినియోగదారులకు నష్టపరిహారం ఇప్పించాలని, కోర్టు ఖర్చులు చెల్లించాలని ఏసీసీసీ న్యాయస్థానాన్ని కోరింది. ఈ ఆరోపణలపై అమెజాన్ ఆస్ట్రేలియా ప్రతినిధి స్పందిస్తూ.. "ఏసీసీసీ దాఖలు చేసిన కేసును మేము క్షుణ్ణంగా సమీక్షిస్తున్నాము. దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి మేము రెగ్యులేటర్‌కు పూర్తిగా సహకరించాము" అని తెలిపారు. దశాబ్దానికి పైగా ప్రకటనలు లేకుండా అందుబాటులో ఉన్న ప్రైమ్ వీడియో, 2024 ప్రారంభం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో యాడ్స్‌ను ప్రవేశపెట్టడం గమనార్హం.

# హైదరాబాద్‌కు రెండు గ్రోత్ ఇంజన్లు.. ఒకవైపు పశ్చిమం, మరోవైపు దక్షిణం


**హైదరాబాద్ అభివృద్ధికి రెండు కీలక కారిడార్లుగా వెస్ట్ హైదరాబాద్, భారత్ ఫ్యూచర్ సిటీ**

**వెస్ట్ హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఆకాశహర్మ్యాల నిర్మాణం**

**దక్షిణాన ఫ్యూచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేవంత్ ప్రభుత్వం**

**ఫార్మా సిటీ భూములపైనే ఫ్యూచర్ సిటీ అంటూ బీఆర్ఎస్ ఆరోపణలు**

**ఇది పోటీ కాదని, నగరం సామర్థ్యాన్ని పెంచే పరిణామమని నిపుణుల విశ్లేషణ**




హైదరాబాద్ మహానగరం తన ఆర్థిక, రియల్ ఎస్టేట్ సామర్థ్యాన్ని రెండు కీలక కారిడార్ల ద్వారా విస్తరించుకుంటోంది. ఇప్పటికే తిరుగులేని వ్యాపార, సంపద కేంద్రంగా నిలిచిన పశ్చిమ హైదరాబాద్ ఒకవైపు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుండగా, దానికి దీటుగా దక్షిణాన 'భారత్ ఫ్యూచర్ సిటీ' పేరుతో మరో కొత్త అధ్యాయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ రెండు కారిడార్లు పరస్పరం పోటీ పడకుండా, నగరం భవిష్యత్ అభివృద్ధికి రెండు చోదక శక్తులుగా (గ్రోత్ ఇంజన్లు) పనిచేస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. గత రెండు దశాబ్దాలుగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట, నియోపోలిస్ వంటి ప్రాంతాలతో కూడిన పశ్చిమ హైదరాబాద్.. నగరం రూపురేఖలను మార్చేసింది. గ్లోబల్ కంపెనీలు, గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్‌లు, ప్రీమియం నివాస ప్రాజెక్టులతో ఈ ప్రాంతం హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా నిలబెట్టింది. ప్రస్తుతం కోకాపేట, నియోపోలిస్, ఉస్మాన్ నగర్ వంటి ప్రాంతాల్లో 60 నుంచి 70 అంతస్తుల ఆకాశహర్మ్యాల నిర్మాణానికి అనుమతులు లభించడంతో ఇక్కడ అభివృద్ధి నిరంతరాయంగా సాగుతోంది. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం హైదరాబాద్‌కు నాలుగో నగరంగా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించింది. రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో జూన్ 10, 2026న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని సీఎం ప్రారంభించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి దక్షిణంగా, శ్రీశైలం-నాగార్జునసాగర్ జాతీయ రహదారుల మధ్య సుమారు 30,000 ఎకరాల్లో ఈ నగరాన్ని నిర్మించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు వంటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, దేశంలోనే తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీగా దీనిని తీర్చిదిద్దుతామని ప్రభుత్వం చెబుతోంది. డిసెంబర్ 2026 నాటికి సింగపూర్‌కు చెందిన డీపీ ఆర్కిటెక్ట్స్ సంస్థ దీని మాస్టర్ ప్లాన్‌ను పూర్తి చేయనుంది. అయితే, ఈ ప్రాజెక్టుపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఫార్మా సిటీ'ని రద్దు చేసి, అక్కడి భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం 'ఫ్యూచర్ సిటీ' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండించింది. రైతులకు నష్టం జరగకుండా చూస్తామని, ఫ్యూచర్ సిటీని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పరిణామాలపై జీహెచ్ఆర్ ఇన్ఫ్రా మార్కెటింగ్ హెడ్, లగ్జరీ రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు సురేష్ చింతోజు తన విశ్లేషణను అందించారు. "ఇది ఒక కారిడార్ స్థానంలో మరొకటి రావడం కాదు. హైదరాబాద్ తన అభివృద్ధి సామర్థ్యాన్ని విస్తరించుకోవడం. బలమైన నగరాలు ఒకేచోట కాకుండా బహుళ ఆర్థిక కేంద్రాలను సృష్టించుకుంటాయి. వెస్ట్ హైదరాబాద్ ఇప్పటికే సంపద కారిడార్‌గా స్థిరపడగా, ఫ్యూచర్ సిటీ తదుపరి గ్రోత్ యాక్సిస్‌గా మారవచ్చు. ఈ రెండు కలిసి హైదరాబాద్ తర్వాతి దశ అభివృద్ధిని నిర్దేశిస్తాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ డ్యూయల్ గ్రోత్ విధానం ప్రీమియం రెసిడెన్షియల్, కమర్షియల్ రంగాలను మరింత విస్తరిస్తుందని, హెచ్ఎన్ఐ, ఎన్నారై పెట్టుబడిదారులను ఆకర్షిస్తుందని ఆయన అంచనా వేశారు. మొత్తంమీద, పశ్చిమ హైదరాబాద్ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటుండగా, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ప్రణాళిక, మౌలిక సదుపాయాల కల్పన దశలో ఉంది. ఈ రెండు కారిడార్లు కలిసి హైదరాబాద్‌ను భవిష్యత్తుకు సిద్ధం చేస్తూ, నగరాన్ని దీర్ఘకాలిక ఆర్థిక ప్రగతి పథంలో నడిపించనున్నాయి

# ప్రధాన నగరాల్లో తగ్గిన గృహ విక్రయాలు

**సరఫరాలో హైదరాబాద్ టాప్**

**ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6 శాతం తగ్గిన ఇళ్ల అమ్మకాలు**

**కొత్త ఇళ్ల సరఫరాలో 53 శాతం వృద్ధితో హైదరాబాద్ అగ్రస్థానం**

**అమ్మకాల్లో బెంగళూరు, కోల్‌కతా వృద్ధి.. పూణెలో భారీ క్షీణత**

**పశ్చిమాసియా సంక్షోభం, ఐటీ రంగంలోని అనిశ్చితి కారణమన్న అనరాక్**

**దేశవ్యాప్తంగా 10 శాతం పెరిగిన అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య**




దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో గృహ విక్రయాలు మందగించాయి. 2026 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 6 శాతం తగ్గినట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ రీసెర్చ్ తన నివేదికలో వెల్లడించింది. అయితే, ఇదే సమయంలో కొత్త ఇళ్ల సరఫరా మాత్రం పెరగడం గమనార్హం. ముఖ్యంగా హైదరాబాద్, ముంబై నగరాల్లో కొత్త ప్రాజెక్టులు భారీగా ప్రారంభమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే, ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో కలిపి సుమారు 90,715 నివాస గృహాలు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే సమయంలో ఈ సంఖ్య 96,285గా ఉంది. మరోవైపు, కొత్త ఇళ్ల సరఫరా వార్షికంగా 7 శాతం పెరిగింది. కొత్త ప్రాజెక్టుల విషయంలో ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (వీవీ=), హైదరాబాద్ ముందున్నాయి. హైదరాబాద్‌లో కొత్త సరఫరా ఏకంగా 53 శాతం పెరిగి రికార్డు సృష్టించింది. ఇక్కడ దాదాపు 16,970 కొత్త యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. వీవీ=లో 34,555 యూనిట్లతో 23 శాతం వృద్ధి నమోదైంది. సరఫరా పెరిగినప్పటికీ అమ్మకాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవు. అత్యధికంగా 28,710 యూనిట్లు అమ్ముడైన వీవీ=లో సైతం గతేడాదితో పోలిస్తే 8 శాతం క్షీణత కనిపించింది. హైదరాబాద్‌లో అమ్మకాలు కేవలం 2 శాతం మాత్రమే పెరిగాయి. అయితే, బెంగళూరు మాత్రం ఈ ట్రెండ్‌కు భిన్నంగా నిలిచింది. అక్కడ అమ్మకాలు ఒక శాతం పెరిగి 15,285 యూనిట్లుగా నమోదయ్యాయి. కోల్‌కతాలోనూ 10 శాతం వృద్ధి కనిపించింది. మరోవైపు, పూణెలో అమ్మకాలు అత్యధికంగా 15 శాతం పడిపోయాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం, ఐటీ/ఐటీఈఎస్ రంగంలోని అనిశ్చితి కారణంగా చాలామంది ఇళ్లు కొనాలనుకునేవారు 'వేచి చూసే ధోరణి' అవలంబిస్తున్నారని అనరాక్ ఛైర్మన్ అనూజ్ పురి విశ్లేషించారు. ఇదే అమ్మకాల తగ్గుదలకు ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ, పెద్ద లిస్టెడ్ డెవలపర్లు గతంలో కొనుగోలు చేసిన భూముల్లో ప్రాజెక్టులను ప్రారంభించడం వల్ల సరఫరా స్థిరంగా కొనసాగుతోందని తెలిపారు. ఇక దేశవ్యాప్తంగా నివాస గృహాల సగటు ధరలు 7 శాతం పెరిగాయి. అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య కూడా 10 శాతం పెరిగి 6.16 లక్షలకు చేరింది. బెంగళూరులో అమ్ముడుపోని ఇళ్ల నిల్వ ఏకంగా 34 శాతం పెరగడం గమనార్హం. మొత్తం మీద, ప్రపంచ పరిణామాల మధ్య భారత రియల్ ఎస్టేట్ రంగం మిశ్రమంగా స్పందిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో సరఫరా భారీగా పెరగడం వల్ల ఇల్లు కొనుగోలు చేయాలనుకునే వారికి మరిన్ని ఆప్షన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# భారీగా తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర



వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు చమురు కంపెనీలు ఊరట కల్పించాయి. 19 కేజీల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను భారీగా తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ ఏడాది వాణిజ్య సిలిండర్ ధర తగ్గడం ఇదే మొదటిసారి. ఇవాల్టి నుంచే ఈ కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్‌పై రూ.183.50 మేర ధర తగ్గింది. దీంతో అక్కడ సిలిండర్ ధర రూ.3,113.50 నుంచి రూ.2,930కి చేరింది. కోల్‌కతాలో రూ.174 తగ్గడంతో ధర రూ.3,081.50కి, చండీగఢ్‌లో రూ.181.50 తగ్గింపుతో రూ.2,954.50కి, పాట్నాలో రూ.173 తగ్గింపుతో రూ.3,227కి ధరలు చేరాయి. అలాగే హైదరాబాద్‌లో రూ. 176 తగ్గి రూ. 3,191కి చేరిందిఅంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడమే ఈ ధరల తగ్గింపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని 60 రోజుల పాటు పొడిగించడంతో చమురు ధరలు దిగివచ్చాయి. దీంతో పాటు ప్రపంచంలోని 20 శాతం చమురు రవాణా జరిగే హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలపై ఒత్తిడి తగ్గింది. అయితే, గృహ వినియోగదారులకు మాత్రం ఈసారి కూడా ఎలాంటి శుభవార్త అందలేదు. 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం ఢిల్లీలో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.942, కోల్‌కతాలో రూ.968, ముంబైలో రూ.941.50, చెన్నైలో రూ.957.50, హైదరాబాద్‌లో రూ. 994 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

# జూన్‌లో జీఎస్టీ వసూళ్ల జోరు
# రూ.1.94 లక్షల కోట్లు దాటిన ఆదాయం

**గతేడాది ఇదే నెలతో పోలిస్తే 13.9 శాతం వృద్ధి నమోదు**

**దిగుమతులపై జీఎస్టీ రాబడి 34.6 శాతం పెరగడమే ప్రధాన కారణం**

**ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.6.31 లక్షల కోట్లు దాటిన మొత్తం వసూళ్లు**




దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1.94 లక్షల కోట్లు దాటింది. నేడు విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం గతేడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లు 13.9 శాతం పెరిగాయి. ముఖ్యంగా దిగుమతులపై వచ్చే పన్ను రాబడి గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. 2026 జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం జూన్‌లో ఈ మొత్తం రూ.1,71,105 కోట్లుగా ఉంది. ఈ పెరుగుదలలో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వాటానే అధికం. దిగుమతులపై పన్ను రాబడి ఏకంగా 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లకు చేరుకుంది. అయితే, దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన జీఎస్టీ ఆదాయం మాత్రం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లుగా నమోదైంది. దేశీయ వసూళ్ల వృద్ధి రేటు కంటే దిగుమతులపై వసూళ్ల వృద్ధి రేటు ఎక్కువగా ఉండటం గమనార్హం. రిఫండ్‌ల తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం జూన్‌లో 11.2 శాతం వృద్ధితో రూ.1,62,377 కోట్లకు చేరింది. గతేడాది ఇదే నెలలో నికర వసూళ్లు రూ.1,45,984 కోట్లుగా ఉన్నాయి. ఈసారి మొత్తం రిఫండ్‌లు కూడా దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లకు చేరగా, ఎగుమతులపై 'ఐస్‌గేట్' (×జజు+ూజు) ద్వారా ఇచ్చిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లుగా ఉన్నాయి. ఇక, నికర ఆదాయాన్ని విశ్లేషిస్తే.. దేశీయ లావాదేవీలపై వచ్చిన నికర జీఎస్టీ రాబడి కేవలం 2.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం ఏకంగా 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది. ఇది దిగుమతులపై ఆధారపడి పన్ను వసూళ్లు ఎంతగా పెరిగాయో స్పష్టం చేస్తోంది. ఇక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) గణాంకాలను పరిశీలిస్తే.. స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం వృద్ధితో రూ.6,31,699 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే సమయంలో ఈ వసూళ్లు రూ.5,82,542 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ రాబడి 7.1 శాతం పెరిగి రూ.5,40,218 కోట్లుగా నమోదైంది. మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదవగా, జూన్‌లోనూ అదే స్థాయి వసూళ్లు కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచికగా నిపుణులు భావిస్తున్నారు.

# వాహనదారులకు భారీ ఊరట
# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించిన నయారా

**పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 5, డీజిల్‌పై రూ. 3 మేర తగ్గింపు**

**రెండేళ్లలో ఇంధన ధరలు తగ్గడం ఇదే తొలిసారి**

**దిగొచ్చిన అంతర్జాతీయ ముడి చమురు ధరలే కారణం**




దేశవ్యాప్తంగా వాహనదారులకు నయారా ఎనర్జీ భారీ ఊరట కల్పించింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 5, డీజిల్‌పై లీటర్‌కు రూ. 3 చొప్పున కోత విధించింది. దేశవ్యాప్తంగా ఉన్న 7,000కు పైగా నయారా రిటైల్ ఔట్‌లెట్లలో ఈ తగ్గిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చాయి. గత రెండేళ్లలో దేశంలో ఒక ఇంధన రిటైల్ సంస్థ ధరలను తగ్గించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, కీలకమైన సముద్ర మార్గాలు తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలోనే నయారా ఎనర్జీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, రాష్ట్రాల వారీగా ఉండే వ్యాట్ వంటి స్థానిక పన్నుల కారణంగా తుది రిటైల్ ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. నయారా ధరలను తగ్గించినప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు మాత్రం పాత ధరలనే కొనసాగిస్తున్నాయి. దేశంలోని 90 శాతానికి పైగా ఇంధన మార్కెట్‌ను నియంత్రించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ( బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ( హెచ్‌పీసీఎల్ ) తమ ధరలలో ఎటువంటి మార్పు చేయలేదు. ఢిల్లీలోని ఐఓసీ బంకుల్లో పెట్రోల్ లీటర్ రూ. 102.12, డీజిల్ రూ. 95.20 వద్ద స్థిరంగా ఉన్నాయి. కాగా, ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో మార్చి 26న నయారా పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 పెంచింది. తాజా తగ్గింపుతో ఆ పెంపును పూర్తిగా వెనక్కి తీసుకున్నట్లయింది. మరోవైపు మే నెల ద్వితీయార్థంలో ప్రభుత్వ రంగ సంస్థలు పలు దఫాలుగా పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ. 7.50 చొప్పున పెంచడం గమనార్హం.

# స్వల్పంగా పుంజుకున్న పసిడి

**ఒకరోజు తగ్గుదల తర్వాత స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు**

**తెలుగు రాష్ట్రాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,050**

**22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,30,210గా నమోదు**

**ప్రధాన మెట్రో నగరాల్లో ధరల్లో స్వల్ప తేడాలు**



దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు బుధవారం స్వల్పంగా పుంజుకున్నాయి. క్రితం రోజు తగ్గుముఖం పట్టిన పసిడి ధరలు తిరిగి కోలుకున్నాయి. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర సుమారు రూ.1,42,050 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం.. హైదరాబాద్, విజయవాడ, వరంగల్ వంటి ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,30,210గా నమోదైంది. ఇక 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,06,540 వద్ద ఉంది. నిజామాబాద్, ఖమ్మం వంటి పట్టణాల్లోనూ ఇవే ధరలు అమలవుతున్నాయి. ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే చెన్నైలో పసిడి ధరలు కాస్త అధికంగా ఉన్నాయి. అక్కడ 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,990గా పలికింది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా వంటి మెట్రో నగరాల్లో ధరలు రూ.1,42,050 నుంచి రూ.1,42,200 మధ్య స్వల్ప వ్యత్యాసాలతో ట్రేడ్ అవుతున్నాయి. బంగారం కొనుగోలు చేసే ముందు వినియోగదారులు మార్కెట్‌లోని అప్పటి ప్రత్యక్ష ధరలను సరిచూసుకోవడం ఉత్తమం.

## మళ్లీ పాత రూట్లోకి అల్లరి నరేష్..

### పుట్టినరోజు కానుకగా 'రంభ ఊర్వశి మేనక' ఫస్ట్ లుక్ రిలీజ్!



టాలీవుడ్ సీనియర్ హీరో, కామెడీ కింగ్ అల్లరి నరేష్ నేడు తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అత్యంత ఘనంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా సీరియస్ ఎమోషనల్ కథలతో అలరించిన నరేష్, చాలా విరామం తర్వాత మళ్లీ తన మార్క్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌తో రాబోతుండటంతో ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 'యముడికి మొగుడు' సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి "కామెడీ గోస్ కాస్మిక్" అనే ఒక క్రేజీ ట్యాగ్‌లైన్‌ను కూడా జత చేశారు, ఇది సినిమాలోని వినోద స్థాయి ఏ రేంజ్‌లో ఉండబోతోందో ముందే హింట్ ఇస్తోంది. ఇక తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైలిష్‌గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## ఈ సారి నమ్మండి.. నేను మాట్లాడను

టాలీవుడ్ అక్కినేని అఖిల్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే వైజాగ్ వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన అఖిల్ ఈ మూవీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. నా సినిమా వచ్చి ఇప్పటికీ మూడేళ్లయిందని.. సారీ బ్రదర్.. ఈ విషయంలో నన్ను క్షమించాలంటూ అభిమానులను కోరారు అఖిల్. నా గుండెలపై చేయి వేసుకుని చెబుతున్నా.. ఈ సారి నేను మాట్లాడను.. కేవలం నా సినిమానే మాట్లాడుతుందన్నారు. ఇంతకుమించి నేనేం చెప్పకూడదు.. రెండు రోజులుగా నేను నిద్రపోలేదు.. కళ్లద్దాలు పెట్టుకుని వద్దామనుకున్నానని తెలిపారు. మిమల్ని చూస్తుంటే జూలై 10 వరకు పనిచేసే ఎనర్జీ వచ్చిందని అభిమానులను ఉద్దేశించి అఖిల్ మాట్లాడారు.





## రావు బహదూర్ మూవీ.. ట్రైలర్ రిలీజ్

సత్యదేవ్ హీరోగా వస్తోన్న లేటేస్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ రావు బహదూర్. ఈ చిత్రానికి వెంకటేష్ మహా దర్శకత్వం వహంచారు. ఈ మూవీలో దీపా థామస్ హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. గతంలో ఆయన డైరెక్ట్ చేసిన 'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాలు టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్నాయి. ఈ చిత్రాన్ని మహేశ్ బాబు, నమ్రతా శిరోద్కర్ సొంత నిర్మాణ సంస్థ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ మహేశ్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది. ఈ ట్రైలర్ ట్రైలర్ చూస్తుంటే సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. మునుపెన్నడు చూడని తెలుగు సినిమా రావు బహదూర్ అంటూ ఒక్కసారిగా అంచనాలు పెంచేశారు మహేశ్ బాబు. కాగా.. ఈ చిత్రంలో వికాస్ ముప్పాల, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, కునాల్ కౌశిక్, మాస్టర్ కిరణ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు స్మరణ్ సాయి సంగీతమందించారు.

## సుడిగాలి సుధీర్ సినిమా.. 'లైలం బాబు'గా శివాజీ



సుడిగాలి సుధీర్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ 'లైలం బాబు' అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. శివాజీ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పోస్టర్‌లో నల్లటి దుస్తులు, పంచెకట్టుతో రాతి సింహాసనంపై కూర్చొని, చేతిలో సీసా పట్టుకుని శివాజీ కనిపించిన తీరు ఆయన పాత్రలోని పవర్ ని చూపిస్తోంది. 'లైలం బాబు' పాత్రలో శివాజీ తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఈ ఫస్ట్ లుక్ తో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ ఈ కీలక పాత్రలో కనిపించనున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు.



## పొలిటికల్ ఎంట్రీపై రాఘవ లారెన్స్ యూటర్న్.. అభిమానులకు భారీ షాక్!

నటుడు రాఘవ లారెన్స్ రాజకీయ ప్రవేశంపై గత కొద్దిరోజులుగా కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ జోరుగా చర్చ సాగుతోంది. తను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే నిర్ణయాన్ని పూర్తిగా తన అభిమానులకే వదిలేస్తున్నట్లు లారెన్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పోటీ చేసి తప్పుకున్న తిరుచ్చి ఈస్ట్ (తిరుచిరాపల్లి తూర్పు) నియోజకవర్గం నుంచి లారెన్స్ బరిలోకి దిగబోతున్నారంటూ సోషల్ మీడియాలో విపరీతంగా రూమర్స్ చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో వాటన్నింటికీ అడ్డుకట్ట వేస్తూ, తన రాజకీయ భవిష్యత్తుపై లారెన్స్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. తాజాగా మంగళవారం మధ్యాహ్నం సోషల్ మీడియా వేదికగా దాదాపు 16 నిమిషాల నిడివి గల ఒక సుదీర్ఘమైన వీడియోను పోస్ట్ చేసిన లారెన్స్, తన పొలిటికల్ ఎంట్రీపై పూర్తి క్లారిటీ ఇచ్చారు. వైరల్ అవుతున్న వార్తల్లో నిజం లేదని, తాను తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే అంతటితో ఆగకుండా, తాను ఎన్నికల్లో పోటీ చేయనంత మాత్రాన రాజకీయాల్లోకి రానని అనుకోవద్దని వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ కేవలం సినిమాలపైనే ఉందని, ఒప్పుకున్న ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడమే తన మొదటి ప్రాధాన్యతని వివరించారు. తాను ప్రత్యక్షంగా ఎన్నికల్లో నిలబడకపోయినా, తన ట్రస్ట్ ద్వారా సమాజానికి చేసే సేవలు మరియు సహాయ కార్యక్రమాలు ఎప్పటిలాగే నిరంతరాయంగా కొనసాగుతాయని ఈ కాంచన హీరో వెల్లడించారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.